





చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

బాబుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. మధురపూడి విమానాశ్రయంలో ఆదివారం రాత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా సోమవారం మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, ఎంపీ భరత్‌కి వినతి పత్రం సమర్పించారు. సమగ్ర శిక్షాలోని అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతో పాటు రెగ్యులర్ చేయాలని..ఇతర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని వారు హామీ ఇచ్చినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఇరవై రోజుల నుంచీ సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.రఘునాథ్, ఉద్యోగులు బి.శ్రీదేవి, రేణుక, రామకృష్ణ, మిజోర తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో 79 ఆర్టికల్స్ : జేసీ

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి) : ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఆర్టికల్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని జేసీ, స్ట్రాంగ్‌రూమ్ పర్యవేక్షణ నోడల్ అధికారి ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం సాయంత్రం తొమ్మిది శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా పరిధిలో దీర్ఘకాలికంగా 15 శాఖలకు చెందిన 79 ఆర్టికల్స్ స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్నట్టు గుర్తించామని, ఇప్పటికే ఆయా శాఖలకు వాటి వివరాలు తెలియజేశామన్నారు. సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ,సహాయ ట్రెజరీ అధికారి కె.వినోద్, ఏఎస్పీ ఎల్. చెంచురెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ కె. ఆనందరావు, ఎండోమెంట్ ఏసీ వి.సోమశేఖర్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఇసుక డ్రెడ్జింగ్‌పై టీడీపీ ధర్నా

కొవ్వూరు, జనవరి 8 : డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక రిగ్ చేసి అక్రమార్జన చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ ద్విసభ్య కమిటీ నాయకులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కొవ్వూరు పట్టణ, మండలంలోని దండకుంటరేవు, ఆరికిరేవుల ఇసుకర్యాంపుల వద్ద సోమవారం టీడీపీ నాయకులు ధర్నా చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిని అడ్డుకుని నిలదీశారు.అనుమతిపత్రాలు చూపించమని అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడనుంచి కొవ్వూరు ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవకు అక్రమ ఇసుక త్రవ్వకాలు, రవాణాపై వినతిపత్రం అందించి ఫిర్యాదుచేశారు.నిబంధనలకు విరుద్ధంగా గోదావరి నదిపై ఉన్న రోడ్డు, రైలు వంతెనలకు అతిదగ్గరలో ఇసుక డ్రెడ్జింగ్ చేయడంతో వంతెన మనుగడకు దెబ్బతింటుందన్నారు.ఇదిలా ఉండగా బ్యారేజ్ వద్ద 3వ కి.మీ నుంచి 12.150 మీటరు వరకు పూడిక తీత పనులకు రాఘవ కనస్ట్రక్షన్స్ కంపెనీ టెం డరు దక్కించుకుందని, గత రెండు రోజులుగా డ్రెడ్జింగ్ పను లు ప్రారంభించారని అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈ సునీల్ తెలిపారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనిసరావు, సూర్యదేవర రంజిత్, ఆళ్ల హరిబాబు,మరపట్ల కళాధర్, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు,కాగిత రఘు, మద్దిపాటి సత్యనారాయణ, య లమర్తి శ్రీరాంప్రసాద్, గొరిజాల సురేష్, వరిగేటి కాంతరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జిల్లా స్పందనకు 226 అర్జీలు

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి) : స్పందనకు అర్జీదారులు పోటెత్తారు. గత రెండు వారాలుగా స్పందన లేకపోవడంతో సోమవారం ఒక్కసారిగా తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ అర్జీదారులతో కిటకిటలాడింది.జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో 226 మంది అర్జీలు అందజేశారు. జేసీ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు.ఆన్‌లైన్‌లో 171,ఆఫ్‌లైన్‌లో 55 దరఖాస్తులు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖ 92, హోమ్ 26, పంచాయతీరాజ్,రూరల్‌డెవలప్‌మెంట్‌కు 23 అర్జీలు వచ్చాయి.

ముగ్గురు సీఐలు బదిలీ

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి నుంచి ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. బొమ్మూరు సీఐ విజయ్ కుమార్, టూటౌన్ సీఐ టి.గణేశ్‌ని విజయవాడ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఏలూరు రేంజ్ డీఐజీ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కడియం సీఐ పి.బి.జె. తిలక్‌ను పశ్చిమగోదావరి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.విజయవాడ దిశ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె. వాసవిని తూర్పుగోదావరి జిల్లా దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.



ఈ డబ్బెక్కడిది!

బ్యాంక్ లావాదేవీలపై ఆరా

- నగదు మార్పిడిపై నిఘా
- బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక దృష్టి
- రూ.10 లక్షలు దాటితే ఇబ్బందే..
- ఒకేసారి 50 ఖాతాలకు జమైనా ఆరా
- ఆరు నెలల లావాదేవీలపై నివేదిక
- బ్యాంకర్లకు అధికారుల ఆదేశాలు
- సమాచారానికి పరుగులు

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వేడి అన్ని రంగాలకు పాకింది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానున్న సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించడం..అభ్యర్థుల ఎంపికలో నిమగ్నం కావడంతో పాటు ఇప్పటికే ప్రచారాలు హోరెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారం. ఇటీవల ఎమ్మెల్యేకు రూ.40 కోట్లు, ఎంపీలకు రూ.80 కోట్లు అవసరమనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఓట్లు కొనుగోలు, ఎన్నికల వ్యవహారాలు, ప్రచారానికి అవసరమయ్యే డబ్బును నాయకులు ముందుగానే సిద్ధంచేసుకుంటారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నిఘా ఉండడంతో ముందస్తుగా జాగ్రత్త పడతారు. ఇటీవల బాగా తెలివి మీరారు. బ్యాంక్ లావాదేవీలు కాకుండా బ్లాక్‌లో ఎక్కువ డబ్బు వ్యవహారం జరుగుతుంది. కొందరు తెలివిగా బ్యాంక్ ఖాతాల్లో వివిధ ప్రాంతాలకు డబ్బును పంపిస్తున్నారు. గతంలో ఎన్నికలకు కనీసం ఆరు నెలల ముందు ఆయా బ్యాంక్‌ల నగదు లావాదేవీల వివరాలను ఇన్‌కంటాక్స్ అధికారుల నుంచి ఎన్నికల కమిషన్ సేకరించేది.ఈ వ్యవహారం రాష్ట్ర స్థాయిలో సాగేది. ఇవాళ ఎందువల్లనో ఏమో మండల, జిల్లా స్థాయిల్లో ప్రతి బ్యాంక్ లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ డబ్బు లావాదేవీలు జరిగిన బ్యాంక్ ఖాతాదారుల వివరాలు, ఒకే సారి 50కు మించి ఖాతాలకు డబ్బు జమవ్వడం తదితర వివరాలన్నీ అధికారులు కోరుతున్నట్టు తెలిసింది. ఈ డేటా సేకరించడం అంత సులభం కాదు. దీంతో ఆయా బ్యాంక్‌ల నిర్వాహకులు తమ హెడ్ ఆఫీసులకు వివరాలు కోసం మెయిల్స్ పెట్టారు. జిల్లాలో మొత్తం 30 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ఉన్నాయి. వాటికి బ్రాంచ్‌లు సుమారు 300 వరకూ ఉన్నాయి. వాటి నుంచి గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ జరిగిన పెద్ద నగదు లావాదేవీల వివరాలన్నీ తక్షణం ఇవ్వాలని జేసీ ఎన్.తేజ్‌భరత్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు.దీంతో గతంలో వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా పెద్ద లావాదేవీలు జరిగినా అన్నింటికీ ఆయా ఖాతాదారులు సంజాయిషీ చెప్పాల్సిన పరిస్థితి రావొచ్చు. ఎవరైనా ఉద్దేశపూరకంగా చేస్తే వారి పని అయిపోయినట్టే. కానీ ఎన్నికల నిర్వహణకు ఎవరూ బ్యాంక్‌ల ద్వారా పెద్ద లావాదేవీలు జరపరు. బ్లాక్ మనీ అంతా నగదు రూపంలోనే ఆయా ప్రాంతాలకు చేరిపోతూ ఉంటుంది. ప్రస్తుతం దీనిపైనే అధికారులు నిఘా పెడుతున్నారు.

తక్షణ నివేదిక ఇవ్వండి : జేసీ

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జేసీ ఎన్.తేజ్ భరత్ జిల్లాలో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి, బ్యాంక్ లావాదేవీలపై ఆరా తీశారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ పెద్ద మొత్తంలో జరిగిన ప్రధాన నగదు లావాదేవీల మొత్తం జాబి తాను అన్ని బ్యాంకుల నిర్వాహకులు తమకు అంద జేయాలని ఆదేశించారు. 2024లో ఎన్నికల నిర్వహణ దృష్ట్యా బ్యాంకర్లు తక్షణ నివేదిక అందజేయా లన్నారు. జిల్లాలోని బ్యాంకుల కంట్రోలర్లు, కోఆర్డినే టర్లు మండలాలు, నియోజకవర్గాల వారీ నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. ఒక రోజులో జరిగిన మొత్తం లావాదేవీల వివరాలు,ఒక నెలలో అత్యధిక మొత్తంలో జరిగిన లావాదేవీల వివరాలు, ఎన్నికల ప్రకటనకు ముందు ఆరునెలల్లో కరెన్సీకి డిమాండ్ కంటే అధికంగా నిర్వహించిన ఖాతాదారుల వివరాలు ఇవ్వాలన్నారు. అసా ధారణ రీతిలో ఆన్‌లైన్, డిజిటల్ లావాదేవీలపై నివేదిక అందజేయాలని కోరారు. ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్లుగా పనిచేసేవారి వివరాలు ఇవ్వాలన్నారు.సమావేశంలో డీఆర్‌వో జి.నరసింహులు,ఎల్‌డీఎం డి.దుర్గా ప్రసాద్,కన్వీనర్ వై.సురేష్,ఎస్‌బీఐ, బీవోబీ, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, తదితర అన్ని స్థాయి బ్యాంకుల హెడ్‌లు, ప్రైవేట్ బ్యాంక్ హెడ్‌లు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం నిరోధానికి పోలీసుల చర్యలు

సైలెన్స్.. ప్లీజ్!

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన సైలెన్సర్లలో మార్పులు చేసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుండడంపై పోలీసులు సోమవారం కొరడా ఝుళిపించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలను ఉల్లంఘించి మార్పులు చేసిన సైలెన్సర్లను తొలగించారు. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ట్రాఫిక్ సీఐలు మధుబాబు, రామకృష్ణ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు.ముఖ్యంగా బుల్లెట్లపై దృష్టి సారించారు. డిజిటల్ నాయిస్ లెవెల్ మీటర్‌తో పరిశీలించి 80 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం వచ్చే వాహనాలపై జరిమానాలు విధించారు.20కిపైగా వాహన సైలెన్సర్లను తొలగించారు. ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ప్రత్యేక తనిఖీలను రోజూ కొనసాగిస్తామన్నారు. సైలెన్సర్లలో మార్పులు చేసి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారని చెప్పారు. బుల్లెట్ల సైలెన్సర్లను ఆల్టర్‌నేట్ చేసే మెకానిక్‌లను గుర్తించి వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 35 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్ట ప్రకారం విచారణ జరిపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదుల్లో ఈస్ట్‌జోన్‌కి సంబంధించినవి 6, నార్త్ జోన్ 10, సౌత్ జోన్ 3, సెంట్రల్ జోన్ 8, దిశా ఒకటి, కొవ్వూరు డివిజన్ 7 ఉన్నాయి.

పిల్లలు బడిలో ఉండాలి : ఎస్పీ

బడిఈడు పిల్లలు తరగతి గదుల్లో ఉండాలని, అలాంటి పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ జగదీశ్ హెచ్చరించారు. 'ఆపరేషన్ స్వేచ్ఛ'లో భాగంగా ఈ నెల 11 వరకూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.18ఏళ్లలోపు పిల్లలు బడికి వెళ్లకుండా పనిలోకి వెళ్తున్నట్టు తెలిస్తే వెంటనే డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు.

అంతటా.. మోసం!



- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- ఎరువులు.. పురుగు మందులు కల్తీయే..
- అపరాల సంగతి అంతే మరి
- పెట్రోల్ కల్తీ.. నకిలీ సిగరెట్ల హల్‌చల్
- హోటళ్లలో నాణ్యతలేని ఆహారం
- గతేడాది లక్ష్యం అధిగమించిన విజిలెన్స్
- కోట్లాది రూపాయల సరుకు సీజ్
- నిరంతరం దాడులు సాగాలని డిమాండ్

మార్కెట్‌లో ఏది చూసినా నకిలీ.. బంగారం నుంచి బట్టల వరకూ.. బియ్యం నుంచి పెట్రోల్ వరకూ.. అంతా నకిలీయే.. అంతటా నకిలీయే.. మంచిది దొరికిందా మన అదృష్టం.. లేదా మన దురదృష్టం అని జనం సరిపెట్టుకోవడంతో ప్రతి ఏడాది విజిలెన్స్ కేసులు అడపాదడపా నమోదవుతున్నాయి.. అదే జనం అధికారులతో జత కలిస్తే.. అక్రమాలకు అడ్డుకట్ట పడడం ఖాయం.. నాణ్యత కలిగిన వస్తువు లభించడం ఖాయం.. సంక్రాంతి పండుగ ముందు ఈ నకిలీల సంగతేంటో అనుకుంటున్నారా! వినియోగదారులారా.. పండుగ హడావుడిలో నకిలీలతో తస్మాత్ జాగ్రత్త.. మీకేదైనా నకిలీ అనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాల్సిందే.. విజిలెన్స్ అధికారులకు పట్టించాల్సిందే.

ఆదమరుపుగా ఉన్నామా అంటగట్టేస్తారు?

రాజమహేంద్రవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) :అక్రమం జరగని వ్యాపారం ఏదో చెప్పుకోండి.. చూద్దాం.. ఇదే మాటను వ్యాపారుల వద్ద అంటే సక్రమంగా చేస్తే లాభాలు ఏం వస్తాయండి.. అంతా నష్టమే.. ఎంతో కొంత అక్రమం ఉండాలనేది వారి మాట.. అది నిజమే మరి.. అడపా అధికారులు దాడుల్లో పట్టుబడిన కేసులే వాస్తవం చెబుతాయి.. ప్రభుత్వం పేదలకు బియ్యం తినడానికి ఇస్తే అవి పక్కదారి పడుతున్నాయి..లక్షల కొద్దీ టన్నులు పోర్టు ద్వారా సక్రమంగా దాటించేస్తున్నారు.ఇక ఫెర్టిలైజర్స్.. పెట్రోల్ బంక్‌లు..అపరాలు ఇలా చెప్పుకుంటూ పోతే అక్ర మం జరగని వ్యాపారం అంటూ లేదు.గతేడాది విజిలెన్స్ అధికారుల పని తీరే ఇందుకు నిదర్శనం.

పెట్రోల్ నుంచి బియ్యం వరకూ..

నిశితమైన నిఘాతో దాడులు నిర్వహిస్తూ శాఖలు/వ్యవస్థల్లో జరిగే అవకతవకలను వెలుగులోకి తీసుకురా వడమే విజిలెన్స్ పని.ప్రజాధనం వృథా కాకుండా.. ప్రభు త్వ ఉద్దేశం పక్కదారి పట్టకుండా విజిలెన్స్ సిబ్బంది కావలి కాయాలి.రాజమహేంద్రవరంలోని మూడు జిల్లాల పరిధి కలిగిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం ఈ సారి నిర్దేశిత లక్ష్యానికంటే 20 శాతం ఎక్కువగానే అధిగమించినట్టు అధికారులు చెబుతున్నారు. గతేడాది దాడులు.. వెలికితీసిన అవకతవకలపై ప్రత్యేక కథనం.

- ఈ ఏడాది 24 పురుగుమందులు/ఎరువులు/విత్తనాల దుకాణాలపై దాడులు చేసి 15 కేసులుపెట్టారు.తీవ్రమైన అవకతవకలపై మూడు కేసులను సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు ఉంచారు. తూనికలు, కొలతలకు సంబం ధించి 3 కేసులు పెట్టారు. 53 క్వింటాళ్ల విత్తనాలు, 557 టన్నుల ఎరువులు,7 లీటర్లు ద్రవ, 192 కిలోల ఘన పురు గుమందులు కలిపి మొత్తం రూ.1.78 కోట్లు విలువ చేసే సరుకు సీజ్ చేశారు.రూ.48 లక్షల విలువ చేసే 113 క్విం టాళ్ల విత్తనాలు,21 కిలోల ఎరువులు,262 లీటర్ల ద్రవ, 3006 కిలోల పురుగుమందులు స్వాధీనం చేసుకున్నారు.
- 9 పప్పులు అపరాల దుకాణాల్లో సోదాలు చేసి ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మడం,డిక్లరేషన్లు లేకపో వడం,తూకాల్లో తేడాలు గుర్తించి రెండు కేసులు బనాయించి రూ.5 లక్షల విలువచేసే సరుకు సీజ్ చేశారు.
- 4 పెట్రోలు బంకుల్లో సోదాలు చేసి ఒక కేసు నమోదు చేశారు. 8 రెస్టారెంట్లలో తనిఖీలు చేసి ఫుడ్ సేఫ్టీపై 9, తూనికల్లో తేడాలపై 12 కేసులు నమోదు చేసి రూ.22 వేల జరిమానా విధించారు.మూడు అంగన్వాడీ సెంటర్లు, 3 పీహెచ్‌సీ/సీహెచ్‌సీ/ప్రభుత్వాస్పత్రుల్లో,7 పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు.
- అక్రమంగా గ్రావెల్/మట్టి తవ్వకాలపై ఒక క్రిమినల్ కేసు వేసి రూ.34 లక్షల సరుకు సీజ్ చేశారు.
- నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న 5 దుకాణాల్లో సోదాలు చేసి 5 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రూ.14 లక్షల విలువైన 25,185 సిగరెట్ పెట్టెలు సీజ్ చేశారు.
- రేషన్ బియ్యం సరుకులు అక్రమ నిల్వ/రవాణా, గృహ వినియోగ సిలిండర్లు వాణిజ్యావసరాలకు వినియోగించడంపై దృష్టి సారించి సుమారు రూ.3.57 కోట్లు విలువ చేసే 4106 కిలోల రేషన్ బియ్యం, 2 క్వింటాళ్ల ఫోర్టిఫైడ్ బియ్యం, 17 క్వింటాళ్ల కందిపప్పు, 55 క్వింటాళ్ల పంచదార, 14 క్వింటాళ్ల పీఎంజీకేవై బియ్యం, 102 లీటర్ల పామాయిల్, అరక్వింటా ఎండీఎం బియ్యం, 10 క్వింటాళ్ల గోధుమపిండి, 12 కిలోల బెల్లం, 12 కిలోల రాగిపిండి, 10 కిలోల పచ్చి శనగపప్పు, 127 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేశారు. 126 మందిపై 59 క్రిమినల్, 132 6ఏ కేసులు వేశారు.
- 43 రహదారి తనిఖీలను నిర్వహించి జీఎస్టీ, మోటారు వాహన, వ్యవసాయ, సీనరేజ్‌కు సంబంధించి మొత్తం రూ.5.46 కోట్లు అపరాధ రుసుంగా వసూలు చేశారు.

ఫుడ్‌సేఫ్టీ మరిచారా?

ప్రస్తుతం ప్రతి శాఖనూ సిబ్బంది కొరత విపరీతంగా వేధిస్తోంది. ఉదాహరణకుప్రజారోగ్యం విషయంలో అత్యంత కీలకమైన ఫుడ్ సేఫ్టీ శాఖలో జిల్లాలో ఒక అధికారి మాత్రమే ఉన్నారు. ఆయనే జిల్లా అంతా చూసుకోవాలి. కనీసం ప్రభుత్వ వాహనం, డ్రైవరు వంటి సదుపాయాలూ లేవు. దీంతో విజిలెన్స్‌కి ఇంకా వేగం అవసరంగా కనిపిస్తోంది. ప్రజలు రోజూ ఎక్కువగా వినియోగించే రెస్టారెంట్లు, ఫుడ్ పాయింట్లు, బార్లు, మాంసాహార, శాఖాహార బజార్లు, బంగారం షాపులు వంటి వాటిపై ఇంకా సీరియస్‌గా దృష్టి సారించాలనే వాదన వినిపిస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరం ఈట్‌స్ట్రీట్‌లోని షాపులకు అవసరమైన అనుమతులు లేవు. ఫుడ్ సేఫ్టీ లేదు. ధరలకు తగిన క్వాలిటీ క్వాంటిటీ గురించి పట్టించుకునేవారు లేరు.అయినా ఏడాది పైనుంచి లక్షలాది వ్యాపారం జరుగు తోంది.అయినా ఎవరికీ పట్టడం లేదు. చిరు వ్యాపారు లకంటే తిమింగళాలను పట్టుకుంటే ఎక్కువ మేలని కొందరు అంటున్నారు. ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా/తవ్వకాలపై విజిలెన్స్ మనకబారిందనే విమర్శలు వినవస్తున్నాయి.



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

మార్కెట్‌లో నకిలీల ఆటకట్టిస్తాం..



ఈ ఏడాది నకిలీల ఆటకట్టిస్తాం. వినియోగదారుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రెస్టారెంట్లు, బార్లు, సినిమాహాళ్లు, హోటళ్లు, ఫుడ్‌పాయింట్లు వంటివి నాణ్యత, పరిమాణం, పరిశుభ్రత కచ్చితంగా పాటించాల్సిందే. ఆహార భద్రతకు, వినియోగ దారుల సంతృప్తికి అధిక ప్రాధాన్యమిస్తాం. కల్తీ, నకిలీలపై వేటు తప్పదు. సివిల్ సప్లైస్ లీకేజీలు, జీఎస్టీపై కూడా దృష్టి పెడతాం. వ్యాపారాలకు తగు అనుమతులు తీసుకోవడంలో చాలా చోట్ల ఉదాశీనత కనిపిస్తోంది. నిబంధనలు పాటించట్లేదు. ఫుడ్, ట్రేడ్ తదితర అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. లేకపోతే యజమానులు/బాధ్యులు ఇకపై కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

- ఎ.సురేశ్ బాబు, విజిలెన్స్ ఎస్పీ, రాజమహేంద్రవరం



మునిసిపల్ కార్మికుల ముట్టడి

రాజమహేంద్రవరం, జనవరి8 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి సమ్మె బాట పట్టిన మునిసిపల్ కార్మికులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి, ప్రధాన గేట్ వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వ సమస్యలను పరిష్కరించక పోగా, ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తూ, తమను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులకు పాల్పడినా సమ్మెను ఆపేది లేదన్నారు. అనంతరం కలెక్టర్‌లో వినతిపత్రం అందజేశారు.

చలికి వణుకుతూ.. నడిరోడ్డుపై నిద్రించి

అంగన్‌వాడీల 24 గంటల దీక్ష

అయ్యో పాపం అంగన్‌వాడీలు.. ఒక పక్క చలి వణికిస్తున్నా తమ డిమాండ్ల సాధనకు 24 గంటల నిరవధిక దీక్షకు దిగారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం నుంచి తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆందోళన చేశారు. సర్కారు దిగిరావాలి.. హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. సోమవారం అర్ధరాత్రి ఆర్‌డీవో కార్యాలయం ఎదుట అదే రోడ్డుపై ఇదిగో ఇలా పిల్లాపాపలతో చలికి వణుకుతూ నిద్రించారు.. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ సమ్మె ఆపేది లేదని.. పోరాటం ఆపమని నినదించారు. - **రాజమహేంద్రవరం అర్బన్**



చలించవా జగన్ : రాజమహేంద్రవరం ఆర్‌డీవో కార్యాలయం ఎదుట చలిలో రోడ్డుపై నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే అధోగతే

పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారు

వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు ధ్వజం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం



మాట్లాడుతున్న వడ్డే శోభనాదీశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే రైతులకు అధోగతి తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీతో పాటు దానికి మద్దతు పలికే అన్ని రాజకీయ పార్టీలను ఓడించాలన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో తొలిరోజు సోమవారం ఆయన మాట్లాడారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యవసాయ సంబంధిత నల్ల చట్టాలను తిరిగి అమలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చి వేసి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందన్నారు. మోదీ పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని, అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో రైతులకు ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని, కానీ రూ.14.65 లక్షల కోట్ల కార్పొరేట్ సంస్థల రుణాలు రద్దు చేశారని మండిపడ్డారు. ఒక్కసారైనా రుణమాఫీ చేయాలని కోరినా మోదీ పట్టించుకోవడంలేదన్నారు. దాదాపు 40 శాతం మంది రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చే దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 12న విజయవాడలో రైతాంగ సమస్యలపై భారీ స్థాయిలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం స్ఫూర్తితో కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధర కోసం బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలతో సహా అనేక రాష్ట్రాలు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకించినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం సై అనడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారనుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి రైతు మహా ప్రదర్శన నిర్వహించారు. సీనియర్ నాయకులు కేశవశెట్టి జెండా ఆవిష్కరించారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ బృందం రైతు ఉద్యమ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, గాలిచంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు, సింహాద్రి ఝాన్సీ, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మహాసభల సందర్భంగా రైతు సంఘాల ప్రదర్శన

ఫోరెన్సిక్ సేవలు కీలకం

ఐజీ అశోక్‌కుమార్


ఐజీని జ్ఞాపికతో సత్కరిస్తున్న శేషారెడ్డి

గండేపల్లి, జనవరి 8: నేరాన్వేషణలో ఫోరెన్సిక్ శాఖ పోలీస్ శాఖకు చాలా కీలకమైందని ఐజీ వీవీ జి.అశోక్‌కుమార్ చెప్పారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో డిగ్రీ, పీజీ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో ఫోరెన్సిక్ వివిధ నూతన అన్వేషణ పద్ధతులు అలాగే వాటి అధ్యయనం అనే అంశాలపై రెండు రోజులు పాటు జరిగే జాతీయ సమావేశాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆదిత్య అధినేత నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ జి. అశోక్‌కుమార్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎం.నాగిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు విభాగంలో ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు మన ఆంధ్రలో ఆదిత్య విద్యాసంస్థలు ఉండడం అభినందనీయమన్నారు. ప్రస్తుత సమాజంలో నేరాలు, ఆన్‌లైన్ మోసాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేరాన్వేషణలో ఎటువంటి చర్యలు తీసుకుంటారో అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జై శంకర్, ఫైండర్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జస్టిస్, పోలీస్ సైన్సెస్ బెంగళూరు రాజేష్‌కుమార్, ఫోరెన్సిక్ శాఖాధిపతి, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ ఔరంగాబాద్, డాక్టర్ రంజిత్ సింగ్, డైరెక్టర్ షెర్లాక్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ న్యూఢిల్లీ శాస్త్రవేత్త మధుసూదనరెడ్డి కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లమల్లి సతీష్ రెడ్డి ప్రిన్సిపాల్ విలాస్ అనీల్ చవాన్, జగ్గంపేట, గండేపల్లి పోలీసులు పాల్గొన్నారు.

విశిష్ట సేవా పురస్కారాలు


గోపాలకృష్ణకు అంతర్జాతీయ నాటక కళారత్న అవార్డు ప్రదానం

అమలాపురం టౌన్, జనవరి 8: మానవతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.బాలయోగి అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సేవా సమితి 49వ వార్షికోత్సవానికి వ్యవస్థాపక అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు అధ్యక్షత వహించగా బాలయోగి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సమితి మానవతా దృక్పథంతో విభిన్న రంగాల్లో సేవలు అందించడం విశేషమన్నారు. మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, మాజీ మంత్రి పరమట వీరరాఘవులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి రామకృష్ణారావు సేవలను ప్రశంసించారు. ప్రవాస భారతీయుడు కూచిభొట్ల ఆనంద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటక రంగ అకాడమీ మాజీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సంఘ సేవకులు మోహన్ దేవ, పేడి శర్మ, ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావుకు విశిష్ట సేవా పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, ఎంవీఎల్ఎన్ మూర్తి, కుడుపూడి శాంతిభూషణ్, వాసంశెట్టి జగదీశ్, బీవీవీ సత్యనారాయణ, కరాటం ప్రవీణ్ పాల్గొన్నారు.

టీడీపీ 'రా కదలిరా' సభకు భారీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తుని రూరల్, జనవరి 8: తునిలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో 'రా.. కదలిరా..' కార్యక్రమం జరగనుంది. దీనికి ఆ పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తుని పట్టణ శివారు చామవరం రోడ్డును ఆనుకుని ఉన్న భారీ లేఅవుట్‌లో సభా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నేత యనమల కృష్ణుడు సోమవారం తునిలో సమావేశమయ్యారు. సభా ప్రాంగణానికి 400 మీటర్ల పరిధిలో హెలిప్యాడ్ పనులను పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు సోమవారం పరిశీలించారు. ఈనెల 10న తునిలో జరగనున్న రా.. కదలిరా సభకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరుకానున్నారని, భారీ సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు రానున్నారని, ప్రజలు కూడా భారీ సంఖ్యలో వస్తారని కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 500పైబడి వలంటీర్లు సేవలు అందించనున్నారన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ నుంచే పోటీ

జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్



విలేకర్లతో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా తాను బరిలో ఉంటానని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, తూర్పుగోదావరి జిల్లాలో అది మరింత తీవ్రంగా ఉందని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం జనసేన పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి నిర్ణయిస్తారని.. అదే ఫైనల్ అన్నారు. చాలా సందర్భాల్లో సిట్టింగ్‌లకు సీటు ఇస్తామని చంద్రబాబు చెప్పి ఉండొచ్చని అయితే పొత్తు ధర్మం ఉంటుందన్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు త్యాగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 10న తునిలో జరిగే చంద్రబాబు బహిరంగ సభకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. జగన్మోహనరెడ్డి తాను పేదవాడినని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలో జనసేన పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనేది సంక్రాంతి పండగ ముందు తేలుతుందన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంపై స్పందిస్తూ వైసీపీ పార్టీలో ఒక సంస్కృతి ఉంటుందని, ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు ఇలా మారుతూనే ఉంటారని, అభ్యర్థి ఎవరనేది చివరి వరకూ చెప్పలేమని దుర్గేష్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

ఇద్దరు యువకులు దుర్మరణం


త్రిమూర్తులు (ఫైల్)

కపిలేశ్వరపురం, జనవరి 8: రెండు వేర్వేరు బైక్‌లపై ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు-కాలేరు రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం కపిలేశ్వరపురం మండలం వడ్లమూరుకు చెందిన పెందుర్తి సతీష్ (19), కె.గంగవరం మండలం ఎండగండికి చెందిన కడలి త్రిమూర్తులు (32) సోమవారం రాత్రి బైక్‌లపై ఎదురెదురుగా ప్రయాణిస్తూ నల్లూరు-కాలేరు రహదారి మధ్య ఢీకొన్నారు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమైన త్రిమూర్తులు అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలపాలైన సతీష్‌ను 108లో మండపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. కాగా ఎండగండికి చెందిన త్రిమూర్తులు వివాహితుడు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు అంగర ఎస్ఐ చంటి తెలిపారు.

ఐటీడీఏ స్పందనకు 32 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ అధికారులు

రంపచోడవరం, జనవరి 1: స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను కోరారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సుమారు 32 అర్జీలు అందాయన్నారు. కాకవాడ-కొయ్యలగూడెం రోడ్డుకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని, వేముకొండ-తూన్నూరుకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని, శ్రీపురం గ్రామానికి పవర్ టిల్లర్లు సబ్సిడీపై మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ డీఎస్ శాస్త్రీ, డీడీ అబుసలాం, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌పీవో రాఘవన్, ఈఈలు డేవిడ్‌రాజ్, ఎండీ యూసఫ్, సుబ్బయ్య, ఎ.రవికుమార్, సీహెచ్‌కెవీ చౌదరి, సావిత్రి, పీఏవో రాంబాబు, వైద్యాధికారులు ఇందిరా, గోపిక, సీడీపీవో సంధ్యారాణి, ఎంపీడీవో హరికృష్ణ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నంతో కలకలం


కలెక్టరేట్ వద్ద రోదిస్తున్న మహిళ

అమలాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం రేపింది. దీంతో పోలీసులు అప్రమత్తమై కలెక్టరేట్ గేట్లు మూసివేసి అర్జీదారులను తనిఖీ చేసిన తర్వాతే అనుమతించారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రుకు చెందిన కొండేపూడి జ్యోతి జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ ఎదుట కలెక్టరేట్ ప్రాంగణంలో తన సమస్యను జేసీకి చెబుతూ ఒక్కసారిగా వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై చల్లుకుని అగ్గిపెట్టె తీసేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న సిబ్బంది, ఇతరులు అప్రమత్తమై అడ్డుకున్నారు. దాంతో జ్యోతి సమస్యను విని న్యాయం చేస్తానని హామీ ఇచ్చి జేసీ నుపూర్‌అజయ్ స్పందన హాలులోకి వెళ్లిపోయారు. అయితే ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో వారు అప్రమత్తమై బాధితురాలు కొండేపూడి జ్యోతి నుంచి కేసు వివరాలు నమోదు చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన ఉప్పే బాపిరాజుకు కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకునేందుకు రూ.3 కోట్లు రుణం ఇప్పిస్తానని చెప్పి తన వద్ద నుంచి రూ.53 లక్షలు తీసుకుందని ఆరోపిస్తూ కొండేపూడి జ్యోతిపై గత కొన్ని నెలల క్రితం కోర్టు ద్వారా ప్రైవేటు కేసు వేశారు. దాంతో కోర్టు ఆదేశాలపై గత ఏడాది డిసెంబరు 11న ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదుచేశారు. అయితే అప్పటి నుంచి జ్యోతిపై పోలీసులు, కేసు పెట్టిన ఉప్పే బాపిరాజు వేధింపులు తీవ్రం కావడంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈ ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు సమాచారం.

'ఆదిత్య'లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క


భట్టివిక్రమార్కతో మాట్లాడుతున్న శేషారెడ్డి

గండేపల్లి,జనవరి 8: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయనకు క్యాంప్ అధినేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ మంత్రి తోట నరసింహం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆదిత్య శేషారెడ్డి తనకు మంచి మిత్రుడన్నారు. ఆదిత్య క్యాంపస్ ఎంతో ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి చెందిందన్నారు. త్వరలోనే ఈ క్యాంపస్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, పేపకాయల రాంబాబు, తోట రాంజీ, తోటకూర సాయి రామకృష్ణ, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యానాం ప్రజా ఉత్సవాలు



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యానాం, జనవరి 8: యానాం నియోజవర్గంలోని జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న 20వ యానాం ప్రజా ఉత్సవాలు సోమవారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహించింది. గురువారం ఆర్ ప్యాక్టర్ అధినేత వీఎస్‌రాజు నేతృత్వంలో ప్రముఖ గాయకులు శ్రీకృష్ణ, సాయి శిల్ప, స్వాతి సత్యభామ, హనుమాన్, సాయిచరణ్, సాయి సిందూర తదితరులు ఆలపించిన సినీ గీతాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. యాంకర్, ప్రముఖ సింగర్ స్వాతి సత్యభామ ఉత్తేజపరిచే విధంగా యువతను ఉర్రూతలూగించారు. అనంతరం నృత్య పోటీలలో గెలుపొందిన వారు ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం జితేంద్ర చేసిన మిమిక్రీ అలరించింది. కార్యక్రమాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రఘునాయగం, భక్తవత్సలం నేతృత్వంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.


పాటలు పాడుతున్న శ్రీకృష్ణ బృందం

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



రాజవొమ్మంగి జనవరి 8: రాజవొమ్మంగి మండలంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు మృతిచెందాడు. జడ్డంగి ఇన్‌చార్జి ఎస్ఐ వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కుంజం ప్రవీణ్ (29) సంజీవనగరం గ్రామం నుంచి చెరుకుంపాలెం వైపుగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చెరుకుంపాలెం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

ముగిసిన చతుర్వేద యాగం


పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

రాజానగరం, జనవరి 8: అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా లోక కల్యాణం, విశ్వశాంతి కోరుతూ గైట్ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవారి వైభవోత్సవం, చతుర్వేద మహాయాగం క్రతువులు సోమవారం ముగిశాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), బదరీలక్ష్మీ దంపతులు, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ, శేషపవిత్ర దంపతులు, గైట్ ఎండీ కె.శశికిరణ్ వర్మ, వెంకటలక్ష్మి దంపతులతో తిరు పతికి చెందిన దివి బాలాజీ దీక్షితులు శ్రీస్వామి, అమ్మవార్లకు వైభవోత్సవాన్ని నిర్వహించారు. చివరి రోజు మహా సుదర్శన యజ్ఞం, నిత్య కైంకర్యాలతో శ్రీవారి వైభవోత్సవం కన్నుల పండువగా ముగిశాయి. మురమళ్లకు చెందిన వేద పండితులు గంటి సుబ్రహ్మణ్యంశాస్త్రి ఘనాపాటి బ్రహ్మత్వంలో పూర్ణాహుతి చేపట్టారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనా వద్ద ఉంచిన సింహాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం దివ్య రథాల్లో కొలువైన స్వామివార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, సీఏ పి.కాశీవిశ్వనాథ్, క్షత్రియ పరిషత్ ప్రముఖులు సత్యనారాయణరాజు, కృష్ణంరాజు పూర్ణాహుతి క్రతువులో పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

చింతూరు, జనవరి 8 : చింతూరులో ఈ నెల 11, 12 తేదీలలో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూనెం కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

యూటీఎఫ్ నాయకులకు పోలీసుల నోటీసులు


నోటీసు అందిస్తున్న పోలీసులు

కూనవరం, జనవరి 8: జనవరి 9,10 తేదీలలో విజయవాడలోని ధర్నాచౌక్ సెంటర్‌లో జరిగే ధర్నాకు వెళ్లొద్దంటూ కూనవరం మండలం యూటీఎఫ్ నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు, రావాల్సిన బకాయిలకు ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నామని దీంట్లో భాగంగా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అయితే ధర్నాలకు దిగొద్దంటూ, పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు వెళ్లి ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు తెలిపారు.

'విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే'


మాట్లాడుతున్న అనిల్

కూనవరం, జనవరి 8: గిరిజన సంక్షేమ హాస్టల్‌లో జరుగుతున్న విద్యార్థుల మరణాలన్ని ప్రభుత్వ హత్యలే అని ఆదివాసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్ అన్నారు. ఏజెన్సీలోని విద్యార్థులు పలు ఆశ్రమ పాఠశాలల్లో చనిపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించకపోవడం కారణంగానే ఈ మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో ఏఎన్ఎంలు లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. నర్సింగపేటలో ఏ విద్యార్థికి అయినా అనారోగ్యం వస్తే వంట మనిషితో ఆస్పత్రికి పంపిస్తున్నారని ఆయన విమర్శించారు. నర్సింగపేటలో ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే ఓ విద్యార్థి చనిపోయిందని ఆయన అన్నారు. గిరిజన సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై పోరాటం సాగిస్తామని అన్నారు. పేరుకే ఏజెన్సీ జిల్లా అని సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ఐటీడీఏ పీవో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని గిరిజన సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా అందిన జాబితా అనుసరించి జర్నలిస్టులకు అనుకూలమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేస్తున్నామని కలెక్టర్ కె.మాదవీలత తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం కొవ్వూరు సబ్‌కలెక్టర్, రాజమహేంద్రవరం ఆర్డీవో, పాత్రికేయుల కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల స్థలాల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు.

పిచ్చుకపై బ్రహ్మాస్త్రం

- అంగన్‌వాడీల సమ్మెను అణచివేసేందుకే 'ఎస్మా'
- ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి జనిపల్లి సత్తిబాబు
- రాజానగరంలో జీవో నెం.2 ప్రతుల దహనం


రాజానగరంలో నిరసన తెలుపుతున్న ఏఐకేఎంఎస్ సభ్యులు

రాజానగరం, జనవరి 8: అంగన్‌వాడీల సమ్మెను అణచివేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించిందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి జనిపల్లి సత్తిబాబు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ 28 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా పిచ్చుకపై బ్రహ్మాస్త్రం మాదిరిగా ప్రభుత్వం ఎస్మా చట్ట జీవోను తీసుకురావడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. న్యాయపరమైన తమ డిమాండ్ల సాధన కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐకేఎంఎస్ సంపూర్ణ మద్దతు తెలిపింది. దీనిలో భాగంగా సోమవారం రాజానగరంలోని అంగన్‌వాడీల నిరవధిక సమ్మె శిబిరాన్ని సోమవారం ఏఐకేఎంఎస్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహం ఎదుట జీవో నెంబరు2 ప్రతులను దహనం చేసి నిరసన తెలియజేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి, నక్కా లక్ష్మి, బొలిశెట్టి సత్యవతి, జి.దుర్గా, టి.గౌరీ, ఎం.సత్యవతి, జి.అనంతలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.మార్తమ్మ, పీఎస్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు జీవో నెం.2 ప్రతులను దహనం చేశారు. ఎన్ని జీవోలు తెచ్చినా తమ న్యాయమైన డిమాండ్లు తీర్చేవరకు సమ్మె విరమించబోమన్నారు.

కడియం: కడియంలో దీక్షా శిబిరంలో రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వం తమను బెదిరించడానికి ఎస్మా ప్రయోగించిందని, అయితే ఈ చట్టం తమకు వర్తించదన్నారు. బెదిరింపులకు లొంగేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ ప్రతినిధులు వెంకటలక్ష్మి, ఏడుకొండలు, సుజాత తదితరులు తెలిపారు.


సీతానగరంలో జీవో నెం.2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఏజెన్సీ సమాచారం

ఎస్మాతో గొంతునొక్కే ప్రయత్నం


ఎస్మా జీవో ప్రతుల దహనం

ఎటపాక, జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా అంగన్‌వాడీల గొంతు నొక్కే ప్రయత్నమని, ఆ జీవోను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు మర్లపాటి నాగేశ్వరరావు అన్నారు. ఎస్మా ప్రయోగాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం అంగన్‌వాడీల నిరసనలో భాగంగా జీవో నంబరు-2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మర్లపాటి మాట్లాడారు. ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, చేతగానితనానికి ఈ జీవో నిదర్శనమని అన్నారు. అంగన్‌వాడీల సమ్మె రాష్ట్ర స్థాయి సమస్యగా మారిందన్నారు. ప్రభుత్వం దిగొచ్చి సమస్యలపై సానుకూల ప్రకటన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అకిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

రాజవొమ్మంగి జనవరి 8: రాజవొమ్మంగిలో సోమవారం నల్ల చీరలు కట్టుకుని అంగన్వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అంగన్వాడీ యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.2ను జారీ చేసి ఎస్మా ప్రయోగించినా అంగన్వాడీ వర్కర్లు తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విధులకు హాజరవ్వమని తేల్చిచెబుతున్నారన్నారు. రోడ్డుపై అంగన్వాడీలు భిక్షాటన చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ అంగన్వాడీల దీక్షకు మద్దతు తెలిపారు. సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ మాట్లడుతూ గత 28 రోజులుగా నిరవధిక సమ్మెలు చేస్తున్న అంగన్వాడీ ఆడపడుచులపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించి ప్రభుత్వం భయాన్ని బయట పెట్టుకుందన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కరం కోసం చేస్తున్న సమ్మెను ప్రభుత్వం తట్టుకోలేక, వారి సమస్యలు పరిష్కరించలేక వారిపై దుర్మార్గంగ ఎస్మాను ప్రయోగించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన పనికి మూల్యం చెల్లించుకోక తప్పదని రామారావు అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలను భయభ్రాంతులకు గురి చేసేందుకే ఇటువంటి చర్యలు అని, ఎవరు అధైర్యపడొద్దని రామారావు అన్నారు. సీఐటీయూ నాయకులు పి.రామరాజు ఉన్నారు.

విధుల్లోకి రాకపోతే ఇబ్బందులు

రాజవొమ్మంగి జనవరి 8: అంగన్వాడీ వర్కర్లు నిరవధిక సమ్మెకు దిగడంతో రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.2ను జారీ చేసిందని, ఇప్పటికైనా విధుల్లోకి రాకపోతే ఇబ్బందులు పడతారని రాజవొమ్మంగి ఐసీడీఎస్ సీడీపీవో దేవమణి అంగన్వాడీలకు సూచించారు. అయితే తాము ప్రభుత్వ ఉద్యోగులం కాదా అంటూ అంగన్వాడీలు సీడీపీవోను ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. దీంతో అంగన్వాడీల దీక్ష శిబిరం నుంచి సీడీపీవో వెనుదిరిగారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆగవు

రంపచోడవరం, జనవరి 8: నిర్బంధం, అరెస్టులు, చీకటి చట్టాలతో ఉద్యమాలు ఆపలేరని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పి.అనసూయ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గత 26 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు తాము పూర్తి మద్దతిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలు శాంతియుతంగా చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం సరికాదన్నారు. జీవో నెం.2ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై మొండి వైఖరి విడనాడి వారి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపా లన్నారు.

విద్యుత్ కార్మికుల ఒక రోజు దీక్ష

మోతుగూడెం, జనవరి 8: చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో సోమవారం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మోతుగూడెం ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ఒకరోజు దీక్ష చేశారు. ఈ దీక్షకు పలు యూనియన్ల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు పల్లపు వెంకటేష్, యర్రంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు, ఏరియర్స్ ఇవ్వాలని, మహిళలకు సంవత్సరానికి ఐదు సెలవులు ఇవ్వాలని, ఈఎస్ఐ పనిమీద మీద కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఏపీ జెన్‌కో ట్రాన్స్‌కోలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం అనేక సార్లు అధికారులకు మొర పెట్టుకున్నా పరిష్కారం చూపలేదన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ కార్మికులకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్మికుల విషయంలో ఎస్మా చట్టాన్ని తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ కార్మికుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రమాణాలు నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జె.రత్నాకర్, చింతా రాంబాబు, బీవీ రమణ, 1104 యూనిట్స్ సభులు, కిరణ్, సతీష్, మల్లికార్జున్, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

వినికిడి లోపాన్ని గుర్తించే మిషన్

రంపచోడవరం, జనవరి 8: పుట్టిన నవజాతి శిశువులకు వినికిడి శక్తి లోపాన్ని గుర్తించి చికిత్సను అందించే ఓటో ఏకోసిస్ట్ మిషన్‌ను సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ డాక్టరు ఎ.వి.క్రాంతికుమార్ మాట్లాడుతూ ఓటో ఏకోసిస్ట్ మిషన్ ద్వారా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి నాలుగు సంవత్సరాల లోపు పిల్లల్లో వినికిడి లోపం గుర్తించి మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడియాట్రీషియన్ ఎం.ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

మోతుగూడెం, జనవరి 8: చింతూరు మండలం మోతుగూడెం డీఏవీ పాఠశాలలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎల్ఎంసీ ఛైర్మన్ బొడ్డు శ్రీధర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల మైదానంలో భోగి మంటలు వేసి ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతూరులో పింఛన్ల పంపిణీ

చింతూరు, జనవరి 8: చింతూరులో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీ ఎం.సుధాకర్, నాయకులు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీపై విమర్శలు సరికాదు..

చింతూరు, జనవరి 8: చింతూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంతబాబు గత టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, ఇతర నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అనంతబాబు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్సీ గుర్తు చేసుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీ అంటూ వృద్ధులను, దివ్యాంగులను చలిలో ఆటోల్లో తరలించుకు రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసీల అభ్యున్నతికి వెచ్చించాల్సిన నిధులను సైతం పక్కదోవ పట్టించిన ఘనత ఒక్క వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చిన్నారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు శీలం తమ్మయ్య, సాల్మన్‌రాజు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

దేవీపట్నం, జనవరి 8: ఇందుకూరుపేట సమీపంలో సోమవారం పోలీసులు నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సుమారు 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాతో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ కేవీ నాగార్జున తెలిపారు.

సంక్రాంతి సంబరాలు


కడియంలో గొబ్బెమ్మలకు నమస్కరిస్తున్న చిన్నారులు

దివాన్‌చెరువు, జనవరి 8: సంక్రాంతి ముందస్తు సంబరాలను పలు పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్‌లో గంగిరెద్దుల వారు, హరిదాసులు, కోయదొరలు వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహోమహోపాధ్యాయ శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ మరువరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రంగనాథరాజు, డైరెక్టర్ శేషగిరిరావు, భవన్స్ అధికారి మూర్తి, ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలోని కేపీఆర్ జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు పెట్టారు. విద్యార్థులు హరిదాసు వేషధారణలతో అలరించారు. అందంగా తీర్చిదిద్దిన రంగవల్లుల్లో గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంక్రాంతి విశిష్టతను వివరించారు. అలాగే నారాయణ పాఠశాలలో ప్రిన్సిపాల్ నందకిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు భోగి మంటలు వెలిగించారు. చిన్నారులు పతంగులు ఎగురవేశారు. పాఠశాల క్రీడా మైదానం సంక్రాంతి వాతావరణంతో అలరించింది.

కడియం: కడియం షిర్డిసాయి విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు వేషధారణతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతలను తెలిపారు. సంక్రాంతికి మన ఇంటి ముంగిటకు వచ్చే ప్రతి పాత్రను ధరించి ప్రదర్శించారు. నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భోగి మంట, భోగిపళ్లు, కర్రసాము, కుస్తీపందేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలు షిర్డిసాయి విద్యానికేతన్ ఫౌండర్ తంబాబత్తుల నాగమణి, ఛైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగాయి.


శ్రీచైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని బాలాజీపేట రవీంద్ర భారతి పాఠశాలలో ఛైర్మన్ ఎంఎస్ మణి పర్యవేక్షణలో సంక్రాంతి సంబరాలు జరిపారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ బి.కుమారి విద్యార్థులు, చిన్నారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.బాలవిజ్ఞాన మందిర్ పాఠశాలలో విద్యార్థులు ముగ్గుల పోటీలు, నృత్యప్రదర్శనలతో అలరించారు. యాజమాన్యం నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆదిరెడ్డి కుటుంబం సంక్రాంతి సంబరాలు

ఆదిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని 25వ డివిజన్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సంక్రాంతి పండుగ వేళ, ఆడబడుచులకు ఆదిరెడ్డి కానుక నినాదంతో బహుమతులు అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం 42 డివిజన్లలోనూ సంక్రాంతి సంబరాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి మణి, తవ్వ రాజా నేతృత్వంలో ముగ్గుల పోటీలు జరిగాయి. రాజా సమకూర్చిన 300 కిట్లను స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు.

నేడు దళిత నాయకుల సమావేశం

కడియం, జనవరి 8: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ స్థాయిలో దళితనాయకుల సమావేశం ఈనెల 9న ధవళేశ్వరంలో జక్కంపూడి సీతారత్నం కళ్యాణ మండపంలో జరుగుతుందని స్థానిక నాయకులు తెలిపారు. సోమవారం వేమగిరిలో బీఆర్ అంబేడ్కర్ పార్కులో నియోజకవర్గ దళిత ముఖ్య నాయకులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, బదుగు ప్రశాంతకుమార్, పెయ్యల రాజేష్, విప్పర్తి ఫణి సమావేశమై పలు అంశాలను చర్చించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పు నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, నూతన ఇన్‌చార్జి, మంత్రి వేణును ఆహ్వానించి సమస్యలను వివరించాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అనిల్, తలారి ప్రసాద్, గోలి దేవా, డేకల్లి హరిష్, చేకురిమిల్లి చిన్న పాల్గొన్నారు.

తాపీ చెక్కిన శిల్పం రెండో ముద్రణ ఆవిష్కరణ



తాపీ చెక్కిన శిల్పం రెండో ముద్రణను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజానగరం, జనవరి 8: రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా సోమవారం సాయంత్రం వడ్డీ సుబ్బారావు రచించిన తాపీ చెక్కిన శిల్పం రెండో ముద్రణను ఆవిష్కరించారు. కళాశాల ప్రాంగణంలోని నన్నయ కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు మహాసభల కార్యదర్శి రెడ్డప్ప దవేజి, ముఖ్య సమన్వయకర్త కేశిరాజు రాంప్రసాద్, కడిమెళ్ల వరప్రసాద్, ఉపాధ్యక్షుడు, ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, పాటల రచయిత రసరాజు తాపీ చెక్కిన శిల్పం రెండో ముద్రణను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత సుబ్బారావును సత్కరించారు.

'క్లీన్ రాజానగరం'లో భాగస్వాములవ్వాలి

దివాన్‌చెరువు, జనవరి 8: గ్రామాల్లో నాయకుల చొరవతో చేపట్టే క్లీన్ రాజానగరం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం దివాన్‌చెరువులో గ్రామస్థులు, అధికారుల సమన్వయంతో క్లీన్ రాజానగరం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే. పారిశుద్ధ్య కార్మికులతో కలసి డ్రైనేజీల్లో సిల్టును తీసి, వీధులను శుభ్రం చేశారు. ఈ నెల 13 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఇదిలా ఉండగా దివాన్‌చెరువు సచివాలయం2 పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమాల్లో డీజీపీవో జానా సత్యనారాయణ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, జడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న, దూలం పెద్ద, గంగిశెట్టి సోమేశ్వరరావు, మండారపు వీర్రాజు, వేమగిరి కృష్ణ పాల్గొన్నారు.

మానసిక రోగులకు సాయం చేస్తాం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన తర్వాత వారిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చాలని.. ఆ విషయంలో న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ)ని సంప్రదిం చవచ్చని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రిలోని మానసిక రోగుల చికిత్సా కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. రోగులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వైద్యుల సలహాలను పాటిస్తూ, క్రమం తప్పకుండా మెడిసిన్ వేసుకుంటే మానసిక వ్యాధుల నుంచి త్వరగా కోలుకోవచ్చన్నారు.

వడ్డే శోభనాద్రీశ్వరరావును కలిసిన గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 8 : మాజీ మంత్రి, పార్లమెంట్ మాజీ సభ్యుడు వడ్డే శోభనాద్రీశ్వరరావును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు శోభనాద్రీశ్వరరావు రాజమహేంద్రవరం రావడం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారిమధ్య చర్చ జరిగినట్టు సమాచారం.

వెదురుపాకలో వికసిత భారత్ సంకల్పయాత్ర

గోకవరం, జనవరి 8: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత భారత్ సంకల్పయాత్ర మండలంలోని వెదురుపాక, గుమ్మళ్ళదొడ్డి గ్రామాల్లో సోమవారం జరిగింది. బీజేపీ నేతలు, అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా కామరాజుపేటకు చెందిన జాజుల వరలక్ష్మికి ఉజ్వల పథకం ద్వారా మంజూరైన గ్యాస్ కనెక్షన్‌ను బీజేపీ నాయకులు అందజేశారు. అనంతరం గుమ్మళ్ళదొడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి బీజేపీ నాయకులు, అధికారులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా భోగిమంటను వేశారు. విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహింపజేశారు. కార్యక్రమంలో గుమ్మళ్లదొడ్డి సర్పంచ్ శరకణం రామలక్ష్మి, బీజేపీ నాయకులు సత్తి వెంకటరెడ్డి, పిల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం, యానిమేటర్లను అరెస్టు చేయాలి

తొలగించబడిన యానిమేటర్లు.. స్పందనలో ఫిర్యాదు


స్పందనలో జేసీకి ఫిర్యాదు చేస్తున్న యానిమేటర్లు

అనపర్తి, జనవరి 8: అనపర్తి మండలంలో అవినీతికి పాల్పడ్డారని సుమారు ఏడు నెలల క్రితం పదమూడు మంది యానిమేటర్లను, వెలుగు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏపీఎం రామరాజును జిల్లా అధికారులు విధుల నుంచి తొలగించారు. వీరందరిపైనా ప్రస్తుత ఏపీఎం గత ఏడాది జూలై నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నలుగురు యానిమేటర్లను మాత్రమే అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. ఏపీఎం సహా మరో పది మంది యానిమేటర్లు దొరకడం లేదంటూ సాకులు చెపుతున్నారు. బెయిల్‌పై వచ్చిన తాము వారం వారం పోలీసుస్టేషన్‌లో సంతకం పెట్టాల్సి వస్తోందని, మిగిలిన వారు దొరికే వరకు సంతకం పెట్టక తప్పదని పోలీసులు చెబుతున్నారని అయితే వీళ్ళంతా పలుకుబడితో పోలీసుల ఎదుటే తిరుగుతున్నారని వాపోతున్నారు. దీంతో ఈ కేసులో అరెస్టై బెయిల్‌పై వచ్చిన యానిమేటర్లు సోమవారం రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జేసీ తేజ్‌భరత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సంబంధం లేని తమను ఇరికించి అరెస్టు చేశారని, అసలైన వారిని వదిలిపెట్టారని, కేసు పెట్టి ఆరు నెలలు పూర్తయినా వారిపై చర్యలు లేవని జేసీకి వివరించారు. అలాగే యానిమేటర్లు రామకృష్ణారెడ్డితో కలిసి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

శాటిలైట్ సిటీలో డంపింగ్ యార్డు తొలగించాలి

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 8: రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధి శాటిలైట్ సిటీ ఇందిరమ్మకాలనీలో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డును తొలగించాలని, కాలనీలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని జనసేన ఉమ్మడి గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అధికారులను కోరారు. కాలనీ వాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు డంపింగ్‌యార్డు నుంచి గ్రామ సచివాలయం వరకు భారీ సంఖ్యలో జన సైనికులు నడుచుకుంటూ వెళ్లి గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెరుకూరి వెంకటరామారావు, యామన నారాయణగౌడ్, బీరా ప్రకాష్, షేక్ అమీనాబేగం, చప్పా చిన్నారవు, పంతం పట్టాబి, కొప్పిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 8: మండలంలోని పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెలుమూరి విస్తా గేటెడ్ కమ్యూనిటీలో శ్రీవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, తోమల సేవ, అర్చన అష్టదళ పాదపద్మారాధన, స్నపన తిరుమంజనం, తిరుప్పావడ, తిరువీధి ఉత్సవం, పుష్పయాగం నిర్వహించారు. అంతరాలయంలోని వివిధ నమూనా ఆలయాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం స్వామివారిని పురవీదుల్లో ఊరేగించారు. కల్యాణ కర్తలుగా వెలుమూరి భీమ శంకరరావు దంపతులు పూజాకార్యక్రమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వెలుమూరి సత్యనారాయణమూర్తి, సుబ్బలక్ష్మి, శ్రీరామ్‌కుమార్, రఘునాథ్, తనూజ్ విష్ణు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి, ప్రసాదవితరణ చేశారు.

జాతీయ పోటీల్లో జీబీఆర్ విద్యార్థినికి రజతం

అనపర్తి, జనవరి 8: అనపర్తిలోని జీబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న బి.లక్ష్మీ సుప్రజపార్వతి జాతీయ కళా పోటీల్లో పాల్గొని రజిత పతకం సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి తెలిపారు. ఇటీవల ముంబైలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో పార్వతి ప్రతిభ కనబరచి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి, గవర్నింగ్ బాడీ సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్లు డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కర్రి హరినాథరెడ్డి తదితరులు అభినందించారు.

వైభవంగా నరసింహస్వామికి మంగళశాసనం

కోరుకొండ, జనవరి 8: ధనుర్మాసం సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో 24రోజులుగా సాగుతున్న తిరుప్పావై గోష్టిలో భాగంగా సోమవారం స్వామికి మంగళశాసనం ప్రాసురం స్వామి వారికి చదివి వినిపించారు. దీనిలో భాగంగా నరసన్న సన్నిధిలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో పలువురు అధ్యాపకులు, అర్చక స్వాములు దీపాలు వెలిగించి స్వామికి మంగళంపాడారు. అలాగే స్థానిక వేంకటేశ్వరస్వామి, ఆర్యవైశ్య కోదండ రామాలయం, పశ్చిమగోనగూడెంలో గీతా మిషన్, హరేరామ సమాజంలో స్వామి వారికి దీపాలు వెలిగించి మంగళాశాసనం చేశారు. కార్యక్రమంలో ఇరగవరపు కృష్ణామాచార్యులు, అనంతాచార్యులు, మిరియాల వెంకటశేషత్రిమూర్తులు, సత్యవతి, చేర్ల రాజ్యలక్ష్మి, ఆర్ఎం తులసి, జాన్హవి, పర్ణశాల అప్పన్న, కొటికలపూడి లక్ష్మితదితరులు పాల్గొన్నారు.

జనసేన అన్నదానం

కోరుకొండ, జనవరి 6: డొక్కా సీతమ్మ, పవన్‌కల్యాణ్ ఆశయ సాధనలో భాగంగా సోమవారం మూడో రోజు కోరుకొండ బస్టాండ్ వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ బస్టాండ్ వద్ద జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, తోట ప్రత్యూషదేవి, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాల్లో ఆకట్టుకున్న గాత్ర కచేరి

అనపర్తి, జనవరి 8: అనపర్తి టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి విజయవాడకు చెందిన మల్లాది బ్రదర్స్ గాత్ర కచేరి ఆకట్టుకుంది. మల్లాది శ్రీరామ ప్రసాద్, మల్లాది రవికుమార్ తమ గానంతో భక్తులను ఆకట్టుకున్నారు. ఎస్‌బీఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాకారులను మేడపాటి చెల్లారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మారెళ్ళ గంగరాజుశర్మ, నల్లమిల్లి నాగిరెడ్డి, కొవ్వూరి రామారెడ్డి, చిన ఆదిరెడ్డి, ఎస్ఎంఎం బాలకృష్ణారెడ్డి, కొవ్వూరి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.


కన్నుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం


బలభద్రపురంలో శ్రీనివాసునికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బిక్కవోలు, జనవరి 8: బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారం నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను అశ్వ వాహనంపై వుంచి గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. ఈసందర్భంగా స్వామి వారి అశ్వ వాహనం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం ప్రత్యేక ఉత్సవం జరిపారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోడానికి వచ్చిన భక్తులకు అన్నదాన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే నెహ్రూ పరామర్శ

గోకవరం, జనవరి 8: మండలంలోని రంపయర్రంపాలెంలో పలు కుటుంబాలను సోమవారం జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త ఉంగరాల బొడ్డియ్య కుమారుడు కాశీని, శస్త్ర చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నవనాసి వెంకటేష్‌ను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతి చెందిన పప్పు మాణిక్యం, బాహు బలేంద్రని సీతారాం, దర్శిపూడి సత్యభామ కుటుంబ సభ్యులను నెహ్రూ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్.అప్పలరాజు, ఉంగరాల రాము, ఉంగరాల గణేష్, బాదంపూడి ప్రకాష్, నవనాసి గణపతి, యర్రా రాంబాబు పాల్గొన్నారు.





శబ్ద కాలుష్యం నిరోధానికి పోలీసుల చర్యలు



చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

బాబుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. మధురపూడి విమానాశ్రయంలో ఆదివారం రాత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా సోమవారం మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, ఎంపీ భరత్‌కి వినతి పత్రం సమర్పించారు. సమగ్ర శిక్షాలోని అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతో పాటు రెగ్యులర్ చేయాలని..ఇతర న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి సహకరిస్తామని వారు హామీ ఇచ్చినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఇరవై రోజుల నుంచీ సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.రఘునాథ్, ఉద్యోగులు బి.శ్రీదేవి, రేణుక, రామకృష్ణ, మిజోర తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో 79 ఆర్టికల్స్ : జేసీ

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి) : ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఆర్టికల్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని జేసీ, స్ట్రాంగ్‌రూమ్ పర్యవేక్షణ నోడల్ అధికారి ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం సాయంత్రం తొమ్మిది శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా పరిధిలో దీర్ఘకాలికంగా 15 శాఖలకు చెందిన 79 ఆర్టికల్స్ స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్నట్టు గుర్తించామని, ఇప్పటికే ఆయా శాఖలకు వాటి వివరాలు తెలియజేశామన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్.సత్యనారాయణ,సహాయ ట్రెజరీ అధికారి కె.వినోద్, ఏఎస్పీ ఎల్. చెంచురెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ కె. ఆనందరావు, ఎండోమెంట్ ఏసీ వి.సోమశేఖర్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఇసుక డ్రెడ్జింగ్‌పై టీడీపీ ధర్నా

కొవ్వూరు, జనవరి 8 : డ్రెడ్జింగ్ బోట్లతో ఇసుక రిగ్ చేసి అక్రమార్జన చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ ద్విసభ్య కమిటీ నాయకులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కొవ్వూరు పట్టణ, మండలంలోని దండకుంటరేవు, ఆరికిరేవుల ఇసుకర్యాంపుల వద్ద సోమవారం టీడీపీ నాయకులు ధర్నా చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిని అడ్డుకుని నిలదీశారు.అనుమతిపత్రాలు చూపించమని అడగ్గా పొంతనలేని సమాధానాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడనుంచి కొవ్వూరు ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవకు అక్రమ ఇసుక త్రవ్వకాలు, రవాణాపై వినతిపత్రం అందించి ఫిర్యాదుచేశారు.నిబంధనలకు విరుద్ధంగా గోదావరి నదిపై ఉన్న రోడ్డు, రైలు వంతెనలకు అతిదగ్గరలో ఇసుక డ్రెడ్జింగ్ చేయడంతో వంతెన మనుగడకు దెబ్బతింటుందన్నారు.ఇదిలా ఉండగా బ్యారేజ్ వద్ద 3వ కి.మీ నుంచి 12.150 మీటరు వరకు పూడిక తీత పనులకు రాఘవ కనస్ట్రక్షన్స్ కంపెనీ టెం డరు దక్కించుకుందని, గత రెండు రోజులుగా డ్రెడ్జింగ్ పను లు ప్రారంభించారని అఖండ గోదావరి కుడిగట్టు విభాగం ఏఈ సునీల్ తెలిపారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనిసరావు, సూర్యదేవర రంజిత్, ఆళ్ల హరిబాబు,మరపట్ల కళాధర్, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు,కాగిత రఘు, మద్దిపాటి సత్యనారాయణ, య లమర్తి శ్రీరాంప్రసాద్, గొరిజాల సురేష్, వరిగేటి కాంతరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జిల్లా స్పందనకు 226 అర్జీలు

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి) : స్పందనకు అర్జీదారులు పోటెత్తారు. గత రెండు వారాలుగా స్పందన లేకపోవడంతో సోమవారం ఒక్కసారిగా తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ అర్జీదారులతో కిటకిటలాడింది.జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో 226 మంది అర్జీలు అందజేశారు. జేసీ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు.ఆన్‌లైన్‌లో 171,ఆఫ్‌లైన్‌లో 55 దరఖాస్తులు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖ 92, హోమ్ 26, పంచాయతీరాజ్,రూరల్‌డెవలప్‌మెంట్‌కు 23 అర్జీలు వచ్చాయి.

ముగ్గురు సీఐలు బదిలీ

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి నుంచి ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. బొమ్మూరు సీఐ విజయ్ కుమార్, టూటౌన్ సీఐ టి.గణేశ్‌ని విజయవాడ కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఏలూరు రేంజ్ డీఐజీ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కడియం సీఐ పి.బి.జె. తిలక్‌ను పశ్చిమగోదావరి జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.విజయవాడ దిశ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ కె. వాసవిని తూర్పుగోదావరి జిల్లా దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఈ డబ్బెక్కడిది!



బ్యాంక్ లావాదేవీలపై ఆరా

- నగదు మార్పిడిపై నిఘా
- బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక దృష్టి
- రూ.10 లక్షలు దాటితే ఇబ్బందే..
- ఒకేసారి 50 ఖాతాలకు జమైనా ఆరా
- ఆరు నెలల లావాదేవీలపై నివేదిక
- బ్యాంకర్లకు అధికారుల ఆదేశాలు
- సమాచారానికి పరుగులు

రాజమహేంద్రవరం, జనవరి8(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వేడి అన్ని రంగాలకు పాకింది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానున్న సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించడం..అభ్యర్థుల ఎంపికలో నిమగ్నం కావడంతో పాటు ఇప్పటికే ప్రచారాలు హోరెత్తిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికలంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారం. ఇటీవల ఎమ్మెల్యేకు రూ.40 కోట్లు, ఎంపీలకు రూ.80 కోట్లు అవసరమనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఓట్లు కొనుగోలు, ఎన్నికల వ్యవహారాలు, ప్రచారానికి అవసరమయ్యే డబ్బును నాయకులు ముందుగానే సిద్ధంచేసుకుంటారు. ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ నిఘా ఉండడంతో ముందస్తుగా జాగ్రత్త పడతారు. ఇటీవల బాగా తెలివి మీరారు. బ్యాంక్ లావాదేవీలు కాకుండా బ్లాక్‌లో ఎక్కువ డబ్బు వ్యవహారం జరుగుతుంది. కొందరు తెలివిగా బ్యాంక్ ఖాతాల్లో వివిధ ప్రాంతాలకు డబ్బును పంపిస్తున్నారు. గతంలో ఎన్నికలకు కనీసం ఆరు నెలల ముందు ఆయా బ్యాంక్‌ల నగదు లావాదేవీల వివరాలను ఇన్‌కంటాక్స్ అధికారుల నుంచి ఎన్నికల కమిషన్ సేకరించేది.ఈ వ్యవహారం రాష్ట్ర స్థాయిలో సాగేది. ఇవాళ ఎందువల్లనో ఏమో మండల, జిల్లా స్థాయిల్లో ప్రతి బ్యాంక్ లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ డబ్బు లావాదేవీలు జరిగిన బ్యాంక్ ఖాతాదారుల వివరాలు, ఒకే సారి 50కు మించి ఖాతాలకు డబ్బు జమవ్వడం తదితర వివరాలన్నీ అధికారులు కోరుతున్నట్టు తెలిసింది. ఈ డేటా సేకరించడం అంత సులభం కాదు. దీంతో ఆయా బ్యాంక్‌ల నిర్వాహకులు తమ హెడ్ ఆఫీసులకు వివరాలు కోసం మెయిల్స్ పెట్టారు. జిల్లాలో మొత్తం 30 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ఉన్నాయి. వాటికి బ్రాంచ్‌లు సుమారు 300 వరకూ ఉన్నాయి. వాటి నుంచి గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ జరిగిన పెద్ద నగదు లావాదేవీల వివరాలన్నీ తక్షణం ఇవ్వాలని జేసీ ఎన్.తేజ్‌భరత్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు.దీంతో గతంలో వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా పెద్ద లావాదేవీలు జరిగినా అన్నింటికీ ఆయా ఖాతారులు సంజాయిషీ చెప్పాల్సిన పరిస్థితి రావొచ్చు. ఎవరైనా ఉద్దేశపూరకంగా చేస్తే వారి పని అయిపోయినట్టే. కానీ ఎన్నికల నిర్వహణకు ఎవరూ బ్యాంక్‌ల ద్వారా పెద్ద లావాదేవీలు జరపరు. బ్లాక్ మనీ అంతా నగదు రూపంలోనే ఆయా ప్రాంతాలకు చేరిపోతూ ఉంటుంది. ప్రస్తుతం దీనిపైనే అధికారులు నిఘా పెడుతున్నారు.

తక్షణ నివేదిక ఇవ్వండి : జేసీ

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జేసీ ఎన్.తేజ్ భరత్ జిల్లాలో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి, బ్యాంక్ లావాదేవీలపై ఆరా తీశారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకూ పెద్ద మొత్తంలో జరిగిన ప్రధాన నగదు లావాదేవీల మొత్తం జాబి తాను అన్ని బ్యాంకుల నిర్వాహకులు తమకు అంద జేయాలని ఆదేశించారు. 2024లో ఎన్నికల నిర్వహణ దృష్ట్యా బ్యాంకర్లు తక్షణ నివేదిక అందజేయా లన్నారు. జిల్లాలోని బ్యాంకుల కంట్రోలర్లు, కోఆర్డినే టర్లు మండలాలు, నియోజకవర్గాల వారీ నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. ఒక రోజులో జరిగిన మొత్తం లావాదేవీల వివరాలు,ఒక నెలలో అత్యధిక మొత్తంలో జరిగిన లావాదేవీల వివరాలు, ఎన్నికల ప్రకటనకు ముందు ఆరునెలల్లో కరెన్సీకి డిమాండ్ కంటే అధికంగా నిర్వహించిన ఖాతాదారుల వివరాలు ఇవ్వాలన్నారు. అసా ధారణ రీతిలో ఆన్‌లైన్, డిజిటల్ లావాదేవీలపై నివేదిక అందజేయాలని కోరారు. ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్లుగా పనిచేసేవారి వివరాలు ఇవ్వాలన్నారు.సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు,ఎల్‌డీఎం డి.దుర్గా ప్రసాద్,కన్వీనర్ వై.సురేష్,ఎస్‌బీఐ, బీవోబీ, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, తదితర అన్ని స్థాయి బ్యాంకుల హెడ్‌లు, ప్రైవేట్ బ్యాంక్ హెడ్‌లు పాల్గొన్నారు.

సైలెన్స్.. ప్లీజ్!

రాజమహేంద్రవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన సైలెన్సర్లలో మార్పులు చేసి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుండడంపై పోలీసులు సోమవారం కొరడా ఝుళిపించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలను ఉల్లంఘించి మార్పులు చేసిన సైలెన్సర్లను తొలగించారు. ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ట్రాఫిక్ సీఐలు మధుబాబు, రామకృష్ణ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు.ముఖ్యంగా బుల్లెట్లపై దృష్టి సారించారు. డిజిటల్ నాయిస్ లెవెల్ మీటర్‌తో పరిశీలించి 80 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం వచ్చే వాహనాలపై జరిమానాలు విధించారు.20కిపైగా వాహన సైలెన్సర్లను తొలగించారు. ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ప్రత్యేక తనిఖీలను రోజూ కొనసాగి స్తామన్నారు. సైలెన్సర్లలో మార్పులు చేసి శబ్ద కాలు ష్యానికి కారకులవుతున్నారని చెప్పారు. బుల్లెట్ల సైలెన్సర్లను ఆల్టర్‌నేట్ చేసే మెకానిక్‌లను గుర్తించి వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 35 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్ట ప్రకారం విచారణ జరిపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదుల్లో ఈస్ట్‌జోన్‌కి సంబంధించినవి 6, నార్త్ జోన్ 10, సౌత్ జోన్ 3, సెంట్రల్ జోన్ 8, దిశా ఒకటి, కొవ్వూరు డివిజన్ 7 ఉన్నాయి.

పిల్లలు బడిలో ఉండాలి : ఎస్పీ

బడిఈడు పిల్లలు తరగతి గదుల్లో ఉండాలని, అలాంటి పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ జగదీశ్ హెచ్చరించారు. 'ఆపరేషన్ స్వేచ్ఛ'లో భాగంగా ఈ నెల 11 వరకూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.18ఏళ్లలోపు పిల్లలు బడికి వెళ్లకుండా పనిలోకి వెళ్తున్నట్టు తెలిస్తే వెంటనే డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు.

అంతటా.. మోసం!



- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- ఎరువులు.. పురుగు మందులు కల్తీయే..
- అపరాల సంగతి అంతే మరి
- పెట్రోల్ కల్తీ.. నకిలీ సిగరెట్ల హల్‌చల్
- హోటళ్లలో నాణ్యతలేని ఆహారం
- గతేడాది లక్ష్యం అధిగమించిన విజిలెన్స్
- కోట్లాది రూపాయల సరుకు సీజ్
- నిరంతరం దాడులు సాగాలని డిమాండ్

మార్కెట్‌లో ఏది చూసినా నకిలీ.. బంగారం నుంచి బట్టల వరకూ.. బియ్యం నుంచి పెట్రోల్ వరకూ.. అంతా నకిలీయే.. అంతటా నకిలీయే.. మంచిది దొరికిందా మన అదృష్టం.. లేదా మన దురదృష్టం అని జనం సరిపెట్టుకోవడంతో ప్రతి ఏడాది విజిలెన్స్ కేసులు అడపాదడపా నమోదవుతున్నాయి.. అదే జనం అధికారులతో జత కలిస్తే.. అక్రమాలకు అడ్డుకట్ట పడడం ఖాయం.. నాణ్యత కలిగిన వస్తువు లభించడం ఖాయం.. సంక్రాంతి పండుగ ముందు ఈ నకిలీల సంగతేంటో అనుకుంటున్నారా! వినియోగదారులారా.. పండుగ హడావుడిలో నకిలీలతో తస్మాత్ జాగ్రత్త.. మీకేదైనా నకిలీ అనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాల్సిందే.. విజిలెన్స్ అధికారులకు పట్టించాల్సిందే.

ఆదమరుపుగా ఉన్నామా అంటగట్టేస్తారు?

రాజమహేంద్రవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) :అక్రమం జరగని వ్యాపారం ఏదో చెప్పుకోండి.. చూద్దాం.. ఇదే మాటను వ్యాపారుల వద్ద అంటే సక్రమంగా చేస్తే లాభాలు ఏం వస్తాయండి.. అంతా నష్టమే.. ఎంతో కొంత అక్రమం ఉండాలనేది వారి మాట.. అది నిజమే మరి.. అడపా అధికారులు దాడుల్లో పట్టుబడిన కేసులే వాస్తవం చెబుతాయి.. ప్రభుత్వం పేదలకు బియ్యం తినడానికి ఇస్తే అవి పక్కదారి పడుతున్నాయి..లక్షల కొద్దీ టన్నులు పోర్టు ద్వారా సక్రమంగా దాటించేస్తున్నారు.ఇక ఫెర్టిలైజర్స్. పెట్రోల్ బంక్‌లు..అపరాలు ఇలా చెప్పుకుంటూ పోతే అక్ర మం జరగని వ్యాపారం అంటూ లేదు.గతేడాది విజిలెన్స్ అధికారుల పనితీరే ఇందుకు నిదర్శనం.

పెట్రోల్ నుంచి బియ్యం వరకూ..

నిశితమైన నిఘాతో దాడులు నిర్వహిస్తూ శాఖలు/వ్యవస్థల్లో జరిగే అవకతవకలను వెలుగులోకి తీసుకురా వడమే విజి'లెన్స్' పని.ప్రజాధనం వృథా కాకుండా.. ప్రభు త్వ ఉద్దేశం పక్కదారి పట్టకుండా విజిలెన్స్ సిబ్బంది కావలి కాయాలి.రాజమహేంద్రవరంలోని మూడు జిల్లాల పరిధి కలిగిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం ఈ సారి నిర్దేశిత లక్ష్యానికంటే 20 శాతం ఎక్కువగానే అధిగమించినట్టు అధికారులు చెబుతున్నారు. గతేడాది దాడులు.. వెలికితీసిన అవకతవకలపై ప్రత్యేక కథనం.

- ఈ ఏడాది 24 పురుగుమందులు/ఎరువులు/విత్తనాల దుకాణాలపై దాడులు చేసి 15 కేసులుపెట్టారు.తీవ్రమైన అవకతవకలపై మూడు కేసులను సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు ఉంచారు. తూనికలు, కొలతలకు సంబం ధించి 3 కేసులు పెట్టారు. 53 క్వింటాళ్ల విత్తనాలు, 557 టన్నుల ఎరువులు,7 లీటర్ల ద్రవ, 192 కిలోల ఘన పురు గుమందులు కలిపి మొత్తం రూ.1.78 కోట్లు విలువ చేసే సరుకు సీజ్ చేశారు.రూ.48 లక్షల విలువ చేసే 113 క్విం టాళ్ల విత్తనాలు,21 కిలోల ఎరువులు,262 లీటర్ల ద్రవ, 3006 కిలోల పురుగుమందులు స్వాధీనం చేసుకున్నారు.
- 9 పప్పులు అపరాల దుకాణాల్లో సోదాలు చేసి ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మడం,డిక్లరేషన్లు లేకపో వడం,తూకాల్లో తేడాలు గుర్తించి రెండు కేసులు బనాయించి రూ.5 లక్షల విలువచేసే సరుకు సీజ్ చేశారు.
- 4 పెట్రోలు బంకుల్లో సోదాలు చేసి ఒక కేసు నమోదు చేశారు. 8 రెస్టారెంట్లలో తనిఖీలు చేసి ఫుడ్ సేఫ్టీపై 9, తూనికల్లో తేడాలపై 12 కేసులు నమోదు చేసి రూ.22 వేల జరిమానా విధించారు.మూడు అంగన్వాడీ సెంటర్లు, 3 పీహెచ్‌సీ/సీహెచ్‌సీ/ప్రభుత్వాస్పత్రుల్లో,7 పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు.
- అక్రమంగా గ్రావెల్/మట్టి తవ్వకాలపై ఒక క్రిమినల్ కేసు వేసి రూ.34 లక్షల సరుకు సీజ్ చేశారు.
- నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న 5 దుకాణాల్లో సోదాలు చేసి 5 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రూ.14 లక్షల విలువైన 25,185 సిగరెట్ పెట్టెలు సీజ్ చేశారు.
- రేషన్ బియ్యం సరుకులు అక్రమ నిల్వ/రవాణా, గృహ వినియోగ సిలిండర్లు వాణిజ్యావసరాలకు వినియోగించడంపై దృష్టి సారించి సుమారు రూ.3.57 కోట్లు విలువ చేసే 4106 కిలోల రేషన్ బియ్యం, 2 క్వింటాళ్ల ఫోర్టిఫైడ్ బియ్యం, 17 క్వింటాళ్ల కందిపప్పు, 55 క్వింటాళ్ల పంచదార, 14 క్వింటాళ్ల పీఎంజీకేవై బియ్యం, 102 లీటర్ల పామాయిల్, అరక్వింటా ఎండీఎం బియ్యం, 10 క్వింటాళ్ల గోధుమపిండి, 12 కిలోల బెల్లం, 12 కిలోల రాగిపిండి, 10 కిలోల పచ్చి శనగపప్పు, 127 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేశారు. 126 మందిపై 59 క్రిమినల్, 132 6ఏ కేసులు వేశారు.
- 43 రహదారి తనిఖీలను నిర్వహించి జీఎస్టీ, మోటారు వాహన, వ్యవసాయ, సీనరేజ్‌కు సంబంధించి మొత్తం రూ.5.46 కోట్లు అపరాధ రుసుంగా వసూలు చేశారు.

ఫుడ్‌సేఫ్టీ మరిచారా?

ప్రస్తుతం ప్రతి శాఖనూ సిబ్బంది కొరత విపరీతంగా వేధిస్తోంది. ఉదాహరణకుప్రజారోగ్యం విషయంలో అత్యంత కీలకమైన ఫుడ్ సేఫ్టీ శాఖలో జిల్లాలో ఒక అధికారి మాత్రమే ఉన్నారు. ఆయనే జిల్లా అంతా చూసుకోవాలి. కనీసం ప్రభుత్వ వాహనం, డ్రైవరు వంటి సదుపాయాలూ లేవు. దీంతో విజిలెన్స్‌కి ఇంకా వేగం అవసరంగా కనిపిస్తోంది. ప్రజలు రోజూ ఎక్కువగా వినియోగించే రెస్టారెంట్లు, ఫుడ్ పాయింట్లు, బార్లు, మాంసాహార, శాఖాహార బజార్లు, బంగారం షాపులు వంటి వాటిపై ఇంకా సీరియస్‌గా దృష్టి సారించాలనే వాదన వినిపిస్తోంది. ఉదాహరణకు రాజమహేంద్రవరం ఈట్‌స్ట్రీట్‌లోని షాపులకు అవసరమైన అనుమతులు లేవు. ఫుడ్ సేఫ్టీ లేదు. ధరలకు తగిన క్వాలిటీ క్వాంటిటీ గురించి పట్టించుకునేవారు లేరు.అయినా ఏడాది పైనుంచి లక్షలాది వ్యాపారం జరుగు తోంది.అయినా ఎవరికీ పట్టడం లేదు. చిరు వ్యాపారు లకంటే తిమింగళాలను పట్టుకుంటే ఎక్కువ మేలని కొందరు అంటున్నారు. ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా/తవ్వకాలపై విజి'లెన్స్' మసకబారిందనే విమర్శలు వినవస్తున్నాయి.



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

మార్కెట్‌లో నకిలీల ఆటకట్టిస్తాం..



ఈ ఏడాది నకిలీల ఆటకట్టిస్తాం. వినియోగదారుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రెస్టారెంట్లు, బార్లు, సినిమాహాళ్లు, హోటళ్లు, ఫుడ్‌పాయింట్లు వంటివి నాణ్యత, పరిమాణం, పరిశుభ్రత కచ్చితంగా పాటించాల్సిందే. ఆహార భద్రతకు, వినియోగ దారుల సంతృప్తికి అధిక ప్రాధాన్యమిస్తాం. కల్తీ, నకిలీలపై వేటు తప్పదు. సివిల్ సప్లైస్ లీకేజీలు, జీఎస్టీపై కూడా దృష్టి పెడతాం. వ్యాపారాలకు తగు అనుమతులు తీసుకోవడంలో చాలా చోట్ల ఉదాశీనత కనిపిస్తోంది. నిబంధనలు పాటించట్లేదు. ఫుడ్, ట్రేడ్ తదితర అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. లేకపోతే యజమానులు/బాధ్యులు ఇకపై కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

- ఎ.సురేశ్ బాబు, విజిలెన్స్ ఎస్పీ, రాజమహేంద్రవరం



మునిసిపల్ కార్మికుల ముట్టడి

రాజమహేంద్రవరం, జనవరి8 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి సమ్మెబాట పట్టిన మునిసిపల్ కార్మికులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి, ప్రధాన గేట్ వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వ సమస్యలను పరిష్కరించక పోగా, ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తూ, తమను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులకు పాల్పడినా సమ్మెను ఆపేది లేదన్నారు. అనంతరం కలెక్టర్‌లో వినతిపత్రం అందజేశారు.

చలికి వణుకుతూ.. నడిరోడ్డుపై నిద్రించి అంగన్‌వాడీల 24 గంటల దీక్ష

అయ్యో పాపం అంగన్‌వాడీలు.. ఒక పక్క చలి వణికిస్తున్నా తమ డిమాండ్ల సాధనకు 24 గంటల నిరవధిక దీక్షకు దిగారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం నుంచి తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆందోళన చేశారు. సర్కారు దిగిరావాలి.. హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. సోమవారం అర్ధరాత్రి ఆర్డీవో కార్యాలయం ఎదుట అదే రోడ్డుపై ఇదిగో ఇలా పిల్లాపాపలతో చలికి వణుకుతూ నిద్రించారు.. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ సమ్మె ఆపేది లేదని.. పోరాటం ఆపమని నినదించారు. - **రాజమహేంద్రవరం అర్బన్**



చలించవా జగన్ : రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయం ఎదుట చలిలో రోడ్డుపై నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

క్షీణించిన శాంతి భద్రతలు : జవహర్



బీసీ ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న కేఎస్ జవహర్

కొవ్వూరు, జనవరి 8: జగన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ విమర్శించారు. సోమవారం కొవ్వూరులోని పార్టీ పార్లమెంటరీ కార్యాలయం వద్ద జయహో బీసీ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జవహర్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం బీసీలకు సంబంధించిన 120 పథకాలను రద్దు చేసి, వారిని అణగదొక్కే ప్రయత్నాలు, హత్యలు చేసే ప్రయత్నాలు అనేకం జరిగాయన్నారు. బీసీ ఉపకులాల కార్పొరేషన్లు ఏర్పాటుచేశామని చెప్పుకుంటున్న వైసీపీ ఎక్కడా అధికారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. రాబోయే రోజుల్లో బీసీలంతా టీడీపీకి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బూరుగుపల్లి రాఘవులు, పాలడుగుల లక్ష్మణరావు, చావా శ్రీనివాసరావు, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష్, గారపాటి వెంకటకృష్ణ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, జనవరి 8: పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఖండవల్లి, మల్లేశ్వరం ఫీడర్ల పరిధిలో చెట్లు కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఈ నెల 9న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు సోమవారం తెలిపారు. ఈ కారణంగా ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్లవేమవరం, నల్లాకులవారిపాలెం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, జనవరి 8: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, జగన్- యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేసి వారి భవిష్యత్తును అంధకారం చేశారని, రైతులకు ఉరితాళ్లు తగిలించారని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. సోమవారం నిడదవోలులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలను అరాచకం పేరుతో పీల్చి పిప్పి చేస్తున్నారని, రైతాంగానికి ఎటువంటి ప్రోత్సాహం లేక ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానన్న జగన్ ఆ మాటే మరిచారని, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కూడా పూర్తి చేయలేకపోయారన్నారు. మాట తప్పను మడం తిప్పను అని, ఎన్నో హామీల అమలులో మాట తప్పి మడం తిప్పారన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, కేదారిశెట్టి వెంకటేశ్వరరావు, షాజహాన్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశపెట్టొద్దు

ఆటో యూనియన్ల నిరసన ప్రదర్శన



అన్నవరప్పాడు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

పెరవలి/గోపాలపురం, జనవరి 8: ఆటో కార్మికులు జీవనోపాధి దెబ్బతీసే విధంగా ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశపెట్టొద్దని ఆటో కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాలకు చెందిన ఆటో యూనియన్లు అన్నవరప్పాడు సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వ మైనా, రాబోయే ప్రభుత్వమైనా ఉచిత బస్సు సౌకర్యంను ప్రవేశపెడితే సహించేదిలేదన్నారు. ఎంతో కాలంగా తాము ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, తమ జీవనోపాధి దెబ్బతీసే ఉచిత బస్సు పథకాన్ని విరమించుకోవాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. . గోపాలపురం మండలం దొండపూడి ప్రధానసెంటర్‌లో ఉచిత బస్సు ప్రయాణం వద్దు ఆటోడ్రైవర్ల పొట్టకొట్టొద్దు అంటూ సోమవారం ఉదయం 6గంటల నుంచి సాయంత్ర 6గంటల వరకు సుమారు 12గంటలపాటు దీక్ష చేపట్టారు. దొండపూడి ఫ్రెండ్స్ ఆటోయూనియన్ అధ్యక్షులు పొనుగుమాటి రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ప్రజలను మభ్యపెడుతుందన్నారు. పొరుగు రాష్ట్రల మాదిరిగా ఆంధ్రరాష్ట్రంలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయాన్ని వెంట నే ఉపసంహరించుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఆటో డ్రైవర్లుకు రూ.10వేలు ఇవ్వమని ఎవరూ అడగలేదని అడగకుండానే రూ.10వేలు ఇచ్చి మా పొట్ట కొట్టడం దారుణమన్నారు.ఈ కార్యక్రమంలో ఆటోయూనియన్ ఉపాధ్యక్షులు వెంకటేష్, సభ్యులు, కోలుగుల వెంకటేష్, తలపాల విజయ్‌చందర్, కొక్కిరిపాటి రాజేష్, టేకు శ్రీను, ముమ్మిడి శ్రీను, మల్లిపూడి శ్రీను, వెల్లంకి జయశివసూర్యం,కాసాని కిషోర్, వెంకన్న, వీర్రాజు,పద్మారావు పాల్గొన్నారు.



దొండపూడి సెంటర్‌లో ఆటో యూనియన్ నాయకుల దీక్ష

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలి

అవగాహన సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు భారతి



దేవరపల్లి, జనవరి 8: ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల ఆస్తి హక్కులకు రక్షణ కరువవుతుందని, ఈ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి డిమాండ్ చేశారు. దేవరపల్లిలో శివాలయం కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం న్యాయవాదులు కేసిరాజు రాజ్‌కుమార్, దుగ్గిరాల తాతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ భూహక్కు చట్టంతో ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని, భూ సమస్యలు ఏవైనా ఉంటే రెవెన్యూలో పరిష్కారం కానివి కోర్టుల ద్వారా పరిష్కరిస్తారని, ఈ కొత్త చట్టంతో రెవెన్యూ అధికారులే పరిష్కరిస్తారని, అయితే ఈ విధానంలో అవకతవకలు జరిగే ప్రమాదముందన్నారు. అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పనిచేస్తారని, దీని వల్ల యజమానులకు నష్టం జరగొచ్చని అన్నారు. సీనియర్ న్యాయవాది వల్లభనేని వెంకటసుబ్బారావు మాట్లాడుతూ భూహక్కుచట్టం వల్ల బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతుందని, రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని ప్రజలు, రైతులు సమష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నాగకుమార్,గోపాలకృష్ణ,ఎం.ఈశ్వరయ్య, ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

నల్లజర్ల, జనవరి 8: నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సోమవారం మానవత సంస్థ, తాడేపల్లిగూడెం వైష్ణవి ఆసుపత్రి యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా శిబిరాన్ని మానవత జిల్లా కన్వీనర్ కండెపు సూర్యనారాయణ ప్రారంభించగా వైష్ణవి ఆసుపత్రి వైద్యులు పెనుగొండ బాలకృష్ణ తమ సిబ్బందితో 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు తెల్లం గంగాధర్, జీవీవీ ప్రసాద్, ఐడీవీ అప్పారావు, బోగవల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా'ను ఉపసంహరించుకోవాలి

- సీఐటీయూ దేవరపల్లి కార్యదర్శి భగత్
- 28వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- నిడదవోలులో మెడకు ఉరి తాళ్లు బిగించుకుని నిరసన

దేవరపల్లి, జనవరి 8: అంగన్వాడీల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, ఎస్మా చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, నియోజకవర్గ అంగన్వా డీల కన్వీనర్ టీపీ.లక్ష్మి డిమాండ్ చేశారు. హామీల అమలు కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజు చేరింది. సందర్భంగా దేవరపల్లిలో సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు కళ్లకు రెండు చేతులు అడ్డుపెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ వరకు మానవహారం నిర్వహించి జీవో నెం.2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా భగత్, లక్ష్మి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను, ఉద్యోగులను వేధించడం, సమ్మె ఉప సంహరించుకోవాలని అధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. అధికారులు డెడ్‌లైన్లు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తే సహించేదిలేదన్నారు. కార్యక్ర మంలో సీపీఎం నాయకులు కృష్ణారావు, కే.రత్నాజీ, అంగన్వాడీ నాయకులు పద్మకామేశ్వరి, కుమారి, వరలక్ష్మి, సావిత్రి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక తహశీల్దార్ కార్యాలయగం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేపట్టారు. కొందరు జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన సమ్మెలో పాల్గొనడానికి వెళ్లగా మిగిలిన వారు దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు. గౌరవ వేతనం వద్దు, కనీస వేతనమే కావాలంటూ నినాదాలు చేశారు. సమ్మెలో సంఘ నాయకులు పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, బి.మహాలక్ష్మి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఉరి తాళ్లు బిగించుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 28 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎస్మా ప్రయోగిస్తారా అని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో రాంబాబు, మాధవి, సూర్యకాంతం, రత్నకుమారి, వెంకాయమ్మ, మోహిని పాల్గొన్నారు.



దేవరపల్లిలో చేతులతో కళ్లు మూసుకుని అంగన్వాడీల నిరసన

నల్లజర్ల: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 28 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటం చేస్తామని, ఎస్మాలకు భయపడే ప్రసక్తే లేదని అన్నారు. కార్యక్రమంలో శివకుమారి, కనకదుర్గ, రామాలక్ష్మి పాల్గొన్నారు.

తాళ్లపూడి: రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరవధిక దీక్షకు తాళ్లపూడి మండలం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తరలివెళ్లారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



నిడదవోలులో మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన



నల్లజర్లలో 28 అంకె ఆకారంలో కూర్చొని నిరసన చేస్తున్న అంగన్వాడీలు



సబ్ కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న తాళ్లపూడి అంగన్‌వాడీలు

ఇళ్ల పట్టాల పంపిణీ

తాళ్లపూడి, జనవరి 8: తాళ్లపూడిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రెండో దఫాలో అన్నదేవరపేట 80, బల్లిపాడు 28, పెద్దేవం 18, రాపూరుపాడు 57, తిరుగుడుమెట్టలో 48 మందికి ఇళ్ల పట్టాలు అందించినట్టు తెలిపారు. అలాగే ఎప్పటి నుంచో ఇనాం భూముల్లో నివాసం ఉంటున్న 35 మందికి కూడా ఇదే కార్యక్రమంలో పట్టాలు అందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ పోసిన శ్రీలేఖ, తహశీల్దార్ రాధిక, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, తోట రామకృష్ణ పాల్గొన్నారు.

దళితులకు మొండిచెయ్యి

కాగా రెండో దఫా ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా మండలంలోని పెద్దేవం గ్రామంలో ఎస్సీ వర్గానికి ఒక్క స్థలం కూడా మంజూరు చేయలేదని తిగిరిపల్లి వెంకటకృష్ణారావు, పలువురు దళితులు సోమవారం తహశీల్దార్ రాధికకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఓసీల్లో 18 మందికి పట్టాలు మంజూరు చేసి దళితుల పట్ల చిన్న చూపు చూశారని, ఓసీలు తప్ప తాము ఓటర్లం కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి సర్పంచ్‌గా ఉన్నప్పటికీ తమకు అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



తాళ్లపూడిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న మంత్రి వనిత

దొమ్మేరులో పింఛన్ల పంపిణీ

కొవ్వూరు, జనవరి 8: మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లు, పెంచిన పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని హోం మంత్రి తానేటి వనిత దొమ్మేరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా 220 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ తానేటి కుమారి, బండి పట్టాభిరామారావు, ముదునూరి నాగరాజు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో సహకారశాఖ-2024 డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను మంత్రి వనిత ఆవిష్కరించారు. సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, కార్యదర్శి పొడిపిరెడ్డి రవిశంకర్, కార్యవర్గ సభ్యులు సుబ్బారావు, శివకుమార్ మంత్రిని కలిసి నూతన సంవత్సర డైరీని అందజేశారు.

మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే

రైతులకు అధోగతి

- పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారు
- వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజం
- ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభం



రైతు ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం 2024లో మళ్లీ అధికారంలోకి వస్తే రైతులకు అధోగతి తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీతో పాటు దానికి మద్దతు పలికే అన్ని రాజకీయ పార్టీలను ఓడించాలన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో తొలిరోజు సోమవారం ఆయన మాట్లాడారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యవసాయ సంబంధిత నల్లచట్టాలను తిరిగి అమలు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చివేసి మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందన్నారు. మోదీ పేదల కష్టాన్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని, అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో రైతులకు ఒక్క పైసా కూడా రుణమాఫీ చేయలేదని, కానీ రూ.14.65 లక్షల కోట్ల కార్పొరేట్ సంస్థల రుణాలు రద్దు చేశారని మండిపడ్డారు. ఒక్కసారైనా రుణమాఫీ చేయాలని కోరినా మోదీ పట్టించుకోవడంలేదన్నారు. దాదాపు 40 శాతం మంది రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చే దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 12న విజయవాడలో రైతాంగ సమస్యలపై పెద్దఎత్తున సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ 26న రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం స్ఫూర్తితో కేంద్రం తీసుకొస్తున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధర కోసం రైతాంగం బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలతోసహా అనేక రాష్ట్రాలు విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకించినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం సై అనడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారనుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. ముందుగా మున్సిపల్ స్టేడియం నుంచి రైతు మహాప్రదర్శన నిర్వహించారు. సీనియర్ నాయకులు కేశవశెట్టి జెండా ఆవిష్కరించారు.ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ బృందం రైతు ఉద్యమ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి రామచంద్రయ్య, గాలి చంద్ర, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ గన్ని భాస్కరరావు, సింహాద్రి ఝాన్సీ, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో విద్యార్థులపై బోగిపళ్లు పోస్తున్న తల్లులు



తాళ్లపూడిలో భోగి మంట వేసి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సంక్రాంతి సంబరాలు

దేవరపల్లి, జనవరి 8: సంక్రాంతి ముందస్తు సంబరాలను పలు పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవరపల్లిలోని భాష్యం స్కూల్లో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి గాలిపటాలు ఎగురవేశారు. గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. కృష్ణవతారం, హరిదాసు వేషధారణలోను అలరించారు. పిల్లలపై ఉపాధ్యాయులు భోగిపండ్లు పోశారు. బొమ్మల కొలువు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్యానాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపాల్ సబాన, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని శశి విద్యా సంస్థల్లో పాఠశాల ప్రాంగణాన్ని విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతంలాగా అలంకరించి రంగవల్లులు వేసి హరిదాసు, డూడూ బసవన్నలతో సందడి చేశారు. విద్యార్థులంతా నిర్వహించిన బొమ్మల కొలువు విశేషంగా ఆకర్షించింది. కార్యక్రమాల్లో హెచ్ఎం రాజేంద్ర, ఇన్‌చార్జి మాణిక్యాలరావు, సుశీల తదితర్లు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలోని మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ప్రిన్స్‌పాల్ వీవీ అనీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. అనంతరం స్కూల్ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఉండ్రాజవరం: మండంలోని పాలంగిలో గోల్డెన్ కిడ్స్ స్కూల్లో చైర్మన్ విద్యాకాంత్, డైరెక్టర్ ఉమ ఆధ్వర్యంలో సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. పిల్లల వేషధారణలు, రైతుల, హరిదాసులు, సోదమ్మల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు బోగిపళ్లు వేసి, బోగిమంటలను వేశారు. గొబ్బిళ్ల పాటపాడుతూ విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు నాట్యం ప్రదర్శించారు.

కొవ్వూరు: కొవ్వూరులోని మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్ సంస్కృత పాఠశాలల్లో సర్వారాయ షుగర్స్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సహకారంతో సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్వారాయ షుగర్స్ ప్రతినిధులు కొవ్వూరు ఏరియా ఏఎస్ఎం రాజ్‌కుమార్, సూర్యశేఖర్, విష్ణు, సురేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



నిడదవోలు శశి స్కూల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు



ఉండ్రాజవరం: పాలంగిలో గోల్డెన్ కిడ్స్ స్కూల్లో సంక్రాంతి వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీ ఖాయం

- పవన్‌కల్యాణ్, చంద్రబాబు నిర్ణయమే ఫైనల్
- వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది
- జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్



విలేకరులతో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 8 : వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, తూర్పుగోదావరి జిల్లాలో అది మరింత తీవ్రంగా ఉందని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమి విజయం తథ్యమని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం జనసేన పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా తాను బరిలో ఉంటానని స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కలిసి నిర్ణయిస్తారని.. అదే ఫైనల్ అన్నారు. చాలా సందర్భాల్లో సిట్టింగ్‌లకు సీటు ఇస్తామని చంద్రబాబు చెప్పి ఉండొచ్చని అయితే పొత్తుధర్మం ఉంటుందన్నారు. ఇరుపార్టీల అభ్యర్థులు త్యాగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 10న తునిలో జరిగే చంద్రబాబు బహిరంగసభకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. జగన్మోహనరెడ్డి తాను పేదవాడినని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లాలో జనసేన పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేస్తుందనేది సంక్రాంతి పండగ ముందు తేలుతుందన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించడంపై స్పందిస్తూ వైసీపీ పార్టీలో ఒక సంస్కృతి ఉంటుందని, ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు ఇలా మారుతూనే ఉంటారని, అభ్యర్థి ఎవరనేది చివరి వరకూ చెప్పలేం అని దుర్గేష్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చీపురుగూడెంలో రోడ్డు పనుల అడ్డగింపు

మెరక చేసి సీసీ రోడ్డు వేస్తాం.. ఆర్అండ్‌బీ డీఈ హామీ

నల్లజర్ల, జనవరి 8: మండలంలోని చీపురుగూడెంలో కొయ్యలగూడెం-నల్లజర్ల ప్రధాన రహదారిని మెరక చేసి 300 మీటర్లు సీసీ రోడ్డు వేస్తామని ఆర్అండ్‌బీ డీఈ వెంకట రమణ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. సోమవారం రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు పనులు జరుగుతుండగా పెద్దలు చెల్లు సుబ్రహ్మణ్యం,చెల్లు వీరవెంకట్రావు, పెద్దరామన్న సమక్షంలో గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పల్లంగా ఉన్న రోడ్డుపైనే సీసీ రోడ్డు వేస్తే బురద, మట్టి చేరి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామంలో కనీసం 100 మీటర్ల మెరక చేసి సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

దీంతో ఆర్అండ్‌బీ డీఈ వెంకటరమణ చీపురుగూడెం చేరుకుని గ్రామ పెద్దలతో మాట్లాడి 100మీటర్లు మెరక చేసి సీసీ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పుంతలో ముసలామ్మ గుడి వద్ద తూర ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్తులు తలంశెట్టి శివప్రసాద్, కంపన దుర్గారావు, చెల్లు శివబాబు, తలంశెట్టి రత్నరావు పాల్గొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన.. రెండేళ్ల జైలు

ఏలూరు క్రైం, జనవరి 8: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన నేరం రుజువు కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ ఏలూరు ఐదో అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయాధికారి జి రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. కొవ్వూరు రూరల్ మండలం కుమారదేవంలో 2019 జులై 1న కంభాల సూరిబాబు తాపీ పని చేయడానికి వెళ్లి మహిళను బెదిరించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదుతో కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశారు. ఏలూరు మహిళా కోర్టులో కేసు విచారణలో సూరిబాబుపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి రాజేశ్వరి తీర్పు చెప్పారు.